
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 9 మే 2024

ఓటుకు నోటు!

తిరుపతిలో పోటాపోటీగా

గతానికి భిన్నంగా ముందే మొదలైన ప్రలోభాల పర్వం

ఈసారి సార్వత్రిక ఎన్నికలకు ప్రధాన పార్టీల తరపున ప్రలోభాల పర్వం ముందే మొదలైపోయింది. పోలింగ్ ముందు రోజు రాత్రి చేపట్టే పంపకాలు వారం రోజుల ముందే మొదలు కావడం గమనార్హం. పోలింగ్ తేదీ సమీపించే కొద్దీ పోలీసులతో పాటు ప్రత్యర్థుల నిఘా పెరుగుతుందని భావించి వీలైనంత ముందుగా ఓటర్లకు నగదు చేర్చేందుకు నేతలు ముందస్తు పంపకాలకు సిద్ధపడిపోతున్నారు. వెంకటగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో సోమవారం నుంచే నగదు పంపిణీ ప్రారంభం కాగా చంద్రగిరి, గూడూరు, సత్యవేడుల్లో వైసీపీ వర్గీయులు మంగళవారం పంపిణీకి శ్రీకారం చుట్టగా శ్రీకాళహస్తిలో బుధవారం నుంచీ నగదు, చీరల పంపకాలు మొదలయ్యాయి. చంద్రగిరిలో రెండు విడతల పంపిణీకి చెవిరెడ్డి వర్గీయులు వ్యూహం పన్నినట్టు సమాచారం. సూళ్ళూరుపేటలో విద్యుత్ సరఫరా ఆపేసి మరీ చీకట్లో నగదు పంపిణీ చేశారు. పుత్తూరులో నగదు కంటే ముందుగా అధికార పార్టీ నేతలు మద్యం పంపిణీకి శ్రీకారం చుట్టేశారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతిలో వైసీపీ, జనసేన పార్టీల నేతలు సోమవారం నుంచే నగదు పంపిణీ చేపట్టారు. సోమవారం ఉదయం నుంచే బూత్ స్థాయిలో ఓటర్లకు నగదు పంచడం మొదలైంది. ఓటుకు రూ. 2వేల చొప్పున ముట్టజెపుతుండగా కొన్ని చోట్ల స్థానిక నేతలు చేతివాటం చూపి రూ. వెయ్యి, రూ. 1500 చొప్పున మాత్రమే అందజేసినట్టు సమాచారం. ఓటరు స్లిప్పులు చూసి నంబర్లు నమోదు చేసుకుని మరీ నగదు పంపిణీ చేస్తున్నట్టు సమాచారం. అధికార పార్టీ నేతలు మాత్రం ఓటుకు రూ. 3 వేల వంతున ఓటరు స్లిప్పులతో నిమిత్తం లేకుండా పంపకాలు చేస్తుండడంతో జనమే విస్తుపోతున్నారు. ఏ స్థాయిలో అక్రమార్జన వుంటే ఈ స్థాయిలో నగదు పంపకాలు జరుగుతాయని చర్చించుకుంటున్నారు.

చంద్రగిరిలో రెండు విడతలకు వైసీపీ వ్యూహం

చంద్రగిరి నియోజకవర్గంలో మంగళవారం వైసీపీ వర్గీయులు నగదు పంపిణీ ప్రారంభించారు. చంద్రగిరి పట్టణంలో పంపిణీ ప్రారంభించిన వైసీపీ వర్గీయులు ఓటుకు రూ. 2 వేల వంతున అందజేస్తున్నారు. పార్టీలు, వర్గాలతో నిమిత్తం లేకుండా అందరికీ పంచుతున్నట్టు సమాచారం. రెండు విడతల్లో నగదు పంపిణీ చేయాలనే వ్యూహం సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. గత ఎన్నికల్లో తొలి విడత ఓటుకు రూ. వెయ్యి అందజేసి చివరలో మరో విడత ఇంటికి రూ. 1500 చొప్పున పంపిణీ చేశారు. ఇపుడు కూడా అదే వ్యూహంతో తొలి విడత రూ. 2 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారని, టీడీపీ వర్గీయుల పంపకాలను బట్టి మలి విడత అదనపు నగదు పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. కాగా టీడీపీ వర్గీయులు బుధవారం నుంచీ రూ.2 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారు.

గూడూరులో రూ.వెయ్యి చొప్పున

గూడూరు పట్టణంలో రూ. 1500 చొప్పున పంచిన వైసీపీ నేతలు గ్రామాల్లో రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నారు. చిట్టమూరులో సోమవారం రాత్రి నుంచీ, గూడూరు పట్టణంలో మంగళవారం రాత్రి నుంచీ, మిగిలిన మండలాల్లో బుధవారం నుంచీ పంపకాలు మొదలయ్యాయి. టీడీపీ నేతలు బుధవారం మధ్యాహ్నం నుంచీ నియోజకవర్గవ్యాప్తంగా ఓటుకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ ప్రారంభించారు.

పుత్తూరులో ఇంటింటికీ మద్యం

నగరి నియోజకవర్గంలో భాగమైన పుత్తూరు, వడమాలపేట మండలాల్లో ప్రధాన పార్టీల నేతలు ఇంకా నగదు పంపకాలు మొదలు పెట్టలేదు. అయితే అధికార పార్టీ వర్గీయులు మాత్రం ఆదివారం నుంచే ఇంటింటికీ మద్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు సమాచారం. బూత్ స్థాయిలో రోజుకు ఒక కేస్ మద్యం బాక్స్ అంటే 48 క్వార్టర్ బాటిళ్లు చేరవేస్తుండగా బాటిళ్ళను ప్రతి ఇంటికీ రోజు మార్చి రోజు అందజేస్తున్నట్టు చెబుతున్నారు. పోలింగ్ రోజు వరకూ రోజూ మద్యం పంపిణీ చేయాలని ముఖ్యనేత ఆదేశించినప్పటికీ కిందిస్థాయి నేతలు చేతివాటం చూపి రోజు మార్చి రోజు అందజేస్తున్నట్టు సమాచారం. అయితే టీడీపీ వైపు నుంచీ ఇంకా నగదు గానీ, మద్యం గానీ పంపిణీ మొదలు కాలేదు.

శ్రీకాళహస్తిలో వైసీపీ నగదు, చీరల పంపిణీ

శ్రీకాళహస్తిలో వైసీపీ వర్గీయులు బుధవారం నుంచీ ఓటుకు రూ. 2 వేలు నగదుతో పాటు చీరలు పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే చీరలు మరీ నాసిరకంగా వున్నాయని మహిళలు వాపోవడం కనిపించింది. కాగా ఓటర్లకు పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలు భారీగా చీరలు తెప్పించారని సమాచారం. వాటిని పలుచోట్ల నిల్వ వుంచారని, ఆ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక ప్రభుత్వాస్పత్రి చేరువలోని ఓ గోదాము నుంచీ చీరలను ఆటోలో తరలిస్తుండగా టీడీపీ వర్గీయులు పట్టుకుని పోలీసులకు పట్టించారు. కాగా టీడీపీ వర్గీయులు సైతం బుధవారం నుంచీ ఓటుకు రూ. 2 వేల వంతున పంపిణీ మొదలు పెట్టారు.

సత్యవేడులో స్వతంత్ర అభ్యర్థి హల్‌చల్

సత్యవేడు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో వున్న రమేష్ బాబు వర్గీయులు హల్‌చల్ చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు మించి హడావిడి చేస్తున్నారు. ఎక్కడికి ప్రచారం వెళ్ళినా వెంట 500 మందికి తగ్గకుండా చూసుకుంటున్నారని, ప్రచారానికి వచ్చే ప్రతి ఒక్కరికీ రోజుకు రూ. 500 చొప్పున చెల్లిస్తున్నారని సమాచారం. దానికి తోడు అభ్యర్థి పది మంది బౌన్సర్లను వెంటపెట్టుకోవడంతో నియోజకవర్గంలో హడావిడి పెరిగిందని చెబుతున్నారు. ఈ అభ్యర్థి అనుచరులు పంపకాలకు కూడా సిద్ధపడ్డారని, ఓటుకు రూ. 2 వేలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని సమాచారం.

సూళ్ళూరుపేటలో విద్యుత్ ఆపేసి నగదు పంపిణీ

సూళ్ళూరుపేటలో వైసీపీ వర్గీయులు నగదు పంపిణీ మొదలు పెట్టారు. మంగళవారం రాత్రి నుంచీ ఓటుకు రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నారు. నాయుడుపేట పట్టణంలో నగదు పంపిణీ ప్రారంభించిన ఆ పార్టీ నేతలు మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా ఆపివేయించి మరీ చీకటిలో నగదు అందజేసినట్టు చెబుతున్నారు.టీడీపీ వైపు కూడా నిధులు చేరుతున్నాయని, అయితే ఓటరుకు రూ. 500 చొప్పున ఇవ్వాలా లేక రూ. వెయ్యి చొప్పున ఇవ్వాలా అన్నది నిర్ణయించుకోలేదని సమాచారం.

వెంకటగిరిలో టీడీపీ ముందంజ

వెంకటగిరిలో నగదు పంపకాల్లో టీడీపీ ముందంజ వేసింది. వైసీపీ వర్గీయులు ఓటుకు రూ. 3 వేల చొప్పున పంపిణీ చేస్తారని మూడు రోజులుగా ప్రచారం జరుగుతుండగానే టీడీపీ వర్గీయులు ఓటుకు రూ. 2 వేల వంతున నియోజకవర్గంలో ఇప్పటికే 70 శాతం మందికి చేరవేసినట్టు తెలిసింది. హైదరాబాదు నుంచీ ఓ పారిశ్రామికవేత్త మనుషులు, చెన్నై, గుంటూరు నుంచీ ముఖ్యనేత సన్నిహితులు స్థానిక పార్టీ నేతల సమక్షంలో నగదు పంపిణీ చేస్తున్నారు. మద్యం పంపిణీ చేయనప్పటికీ మండలాలకు చేరిపోయినట్టు సమాచారం. వైసీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ. 2500 వంతున ఇవ్వాలని ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది.నగదు పంపిణీ కోసం వాకాడులో ఆ పార్టీ ముఖ్యనేతకు చెందిన విద్యా సంస్థ నుంచీ ఉద్యోగులు రంగప్రవేశం చేశారు. మద్యం కూడా మండలాలకు తరలించి పంపిణీకి సిద్ధం చేశారని సమాచారం.



శ్రీకాళహస్తిలోని గోదాములో చీరల మూటలను పరిశీలిస్తున్న సీఐ రారాజు

శ్రీకాళహస్తిలో 3250 చీరల సీజ్

● ముగ్గురు వైసీపీ నేతలపై కేసు

శ్రీకాళహస్తి, మే 8:శ్రీకాళహస్తిలో వైసీపీ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు సిద్ధం చేసిన 3250 చీరలను అధికారులు సీజ్ చేశారు. ఆటో డ్రైవరుతో పాటు ముగ్గురు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ రారాజు కథనం మేరకు... శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని చెంచులక్ష్మి కాలనీ రోడ్డులో వున్న ఓ గోదాంలో కొందరు చీరలను భారీగా నిల్వ చేసి ఆటోలో తరలించేందుకు సిద్ధమయ్యారు.స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆటోతో సహా రాజీవ్ నగర్ కాలనీ చెందిన ఉదయ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అధికారులకు సమాచారం అందించారు. 13 పార్సిల్ మూటల్లో 3250 చీరలున్నట్టు నిర్ధారించారు.వైసీపీ ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి సన్నిహితులైన సలీం, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యాం, మాజీ సభ్యుడు మున్నా తనను చీరలు తరలించమని చెప్పినట్లుగా ఆటో డ్రైవర్ వాంగ్మూలం ఇచ్చాడు. ఆ ప్రకారం ముగ్గురు వైసీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రారాజు తెలిపారు.

రేణిగుంటలో వైసీపీ చీరల పంపిణీ



రేణిగుంటలో పంచుతున్న చీరలు

రేణిగుంట, మే 8:రేణిగుంటలో వలంటీర్ల సహకారంతో బుధవారం డబ్బు, చీరలను వైసీపీ నాయకులు పంపిణీ చేశారు.రాత్రి వేళల్లో వీధిదీపాలను ఆఫ్ చేయించి మరీ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. జీఎం వీధిలో వైసీపీకి చెందిన మహిళలు చీరలు పంపిణీ చేస్తుండగా ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించగా చీరలు పడేసి పరారయ్యారు.దీంతో ఒక బ్యాగులో ఉన్న చీరలను స్వాధీనం చేసుకున్నారు.

60 వేల ఓటరు స్లిప్పులు వెనక్కొచ్చాయ్!

తిరుపతిలోని 3లక్షలమంది ఓటర్లలో 80 శాతానికే పంపిణీ

మిగిలినవి ఫేక్ ఓటర్లవేనా ?

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3.02 లక్షల మంది ఓటర్లు వుండగా అందులో బుధవారం నాటికి కేవలం 2.40 లక్షల మందికి మాత్రమే ఓటరు స్లిప్పులు అందాయి.మిగిలిన 20 శాతం అంటే 60 వేలమందికి పంపిణీ కావాల్సిన స్లిప్పులు కార్యాయాలకు వెనక్కు వచ్చాయి. అంటే అందులో అధిక శాతం బోగస్ ఓట్లుగా భావించాల్సి వస్తోంది.ఈనెల 1వ తేదీ నుంచీ జిల్లావ్యాప్తంగా ఓటర్లకు అధికార యంత్రాంగం స్లిప్పులను పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. స్లిప్పుల పంపిణీకి బుధవారం చివరి రోజు. అయితే తిరుపతి నియోజకవర్గంలో 3,02,503మంది ఓటర్లకుగానూ బుధవారం సాయంత్రానికి 2,41,133 మందికి మాత్రమే స్లిప్పులు చేరాయి. అంటే 79.71 శాతం మందికే ఓటరు స్లిప్పులు అందాయి. మిగిలిన 61,370 మందికి స్లిప్పులు చేరలేదు. ఇళ్ళకు తాళాలు వేసుకుని బయట ప్రాంతానికి వెళ్ళిన వారు, ఇతర ప్రాంతాలకు నివాసం మార్చిన వారు, డబుల్ ఎంట్రీలు, మృతులు, బోగస్ ఓటర్లు వంటి కారణాలతోనే ఇంతమందికి స్లిప్పులు అందకుండా పోయే అవకాశముంది. అయితే ప్రాక్టికల్‌గా చూస్తే వేసవి సెలవుల్లో స్వస్థలాలకు, బంధువుల ఊళ్ళకు, టూర్లకు వెళ్ళే కుటుంబాలు అత్యల్పంగానే వుంటాయి. శాశ్వతంగా నివాసం మార్చిన వారు కూడా తక్కువే. ఓటర్ల జాబితా నుంచీ తొలగని మృతుల పేర్లు సైతం స్వల్పంగానే వుంటాయి. డబుల్ ఎంట్రీలు, దొంగ ఓటర్లే అధికంగా వుండే అవకాశముంది. ఓటర్ల జాబితా సవరణలు చేపట్టినప్పటి నుంచీ ప్రతిపక్షాలు తిరుపతిలో భారీగా దొంగ ఓట్లు చేర్చారని ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. కిందిస్థాయి అధికారుల నుంచీ ఎన్నికల కమిషన్ దాకా అసంఖ్యాకంగా ఫిర్యాదులు చేశారు. ఈ ఆరోపణలు, ఫిర్యాదులూ నిజమేనని ఇపుడు 61 వేల స్లిప్పులు మిగిలిపోవడాన్ని బట్టి అనుమానించాల్సి వస్తోంది.జిల్లాలో మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో 90శాతానికి పైగా ఓటర్లకు స్లిప్పులు అందాయి.కేవలం తిరుపతిలోనే 20 శాతానికి మించి ఓటర్లకు స్లిప్పులకు చేరకుండా అధికారుల వద్దే మిగిలిపోయాయి. వీటిని ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ కేటగిరీల్లో విభజించి బీఎల్‌వోలు తహసీల్దారుకు, ఆయన కలెక్టర్‌కు జాబితా అందజేయాల్సి వుంది.నిజమైన ఓటర్లు నివాసం మార్చడం లేదా తాత్కాలికంగా ఎటైనా వెళ్ళి వుంటే అలాంటి వారికి పోలింగ్ కేంద్రాల వద్దే పోలింగ్ రోజు స్లిప్పులు అందుబాటులో వుంచుతామని అధికారులు చెబుతున్నారు. అదెలా వున్నా భారీ సంఖ్యలో బోగస్ ఓటర్లు వెలుగు చూసే అవకాశమున్నందున అధికారుల తదుపరి చర్యలు ఎలా వుంటాయో వేచి చూడాల్సి వుంది.

పాలిసెట్‌లో 88 శాతం ఉత్తీర్ణత



కె.సాహిత్, 25వ ర్యాంకు కదిరిమంగళం, వడమాలపేట మండలం



కె.వెంకటసత్యం, 153వ ర్యాంకు తాళ్వాయిపాడు, పెళ్లకూరు మండలం



జి.జ్ఞానేష్, 172వ ర్యాంకు నాయుడుపేట

తిరుపతి(విద్య), మే 8: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం గతనెల 27వ తేదీన నిర్వహించిన ఏపీ పాలిసెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో మన జిల్లా విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. 4,436 మంది పరీక్ష రాయగా.. 3,909మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.తిరుపతిలోని విశ్వం స్కూల్లో శిక్షణ తీసుకున్న కె.సాహిత్ 120 మార్కులకుగాను 118 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు సాధించి, జిల్లా స్థాయిలో ఒకటో స్థానంలో నిలిచారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన కె.వెంకటసత్యం 115 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 153వ ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. నాయుడుపేటకు చెందిన జి.జ్ఞానేష్ 114 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 172వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మూడో స్థానం పొందారు.

ఫోరెన్సిక్ నివేదిక ఆలస్యంపై అనుమానాలు

ముందుకు కదలని ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ కేసు దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), మే 8 : మూడేళ్ల క్రితం తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఉపయోగార్థం సుమారు 36 వేల ఓటరు కార్డులు ఈసీ వెబ్‌సైట్ నుంచీ ఎలాంటి క్లైమ్‌లూ లేకుండా డౌన్‌లోడ్ చేసిన కేసులో దర్యాప్తు ముందుకు కదలడంలేదు. దీనిపై విచారణ జరిపిన పోలీసు అధికారుల బృందం ముగ్గురు కంప్యూటరు ఆపరేటర్ల వద్ద అలాగే ఆర్డీవో కార్యాలయం నుంచీ కంప్యూటర్ హార్డు డిస్కులు స్వాధీనం చేసుకుని ఫిబ్రవరిలో విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించడం జరిగింది. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఇటీవల తిరుపతి పర్యటనకు విచ్చేసినప్పుడు ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ వ్యవహారంపై త్వరలో ఫోరెన్సిక్ నివేదిక వస్తుందని, దాని ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేయడం జరుగుతుందని చెప్పారు. అయితే ఇప్పటికీ ఫోరెన్సిక్ నివేదిక అందకపోవడం అనుమానాలకు తావిస్తోంది.ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పనిచేస్తున్న ఒక అధికారి కారణంగా నివేదిక ఆలస్యమవుతున్నట్లు సమాచారం.ఫోరెన్సిక్ నివేదిక త్వరగా పంపాలని ఎన్నికల కమిషన్ సైతం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. సాంకేతిక కోణంలో దర్యాప్తు చేసి అసలు దోషులను గుర్తించాలంటే ఫోరెన్సిక్ నివేదిక ప్రధానమని ఆ నివేదిక వచ్చేంతవరకు తాము ఏమీ చేయలేమని దర్యాప్తు అధికారులు చెపుతున్నారు.ఈ నేపథ్యంలో ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ కేసు విచారణ ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

నేడు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

తిరుపతి (కలెక్టరేట్), మే 8: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అత్యవసర సేవల్లో ఉన్న వారు మొత్తం ఈ నాలుగు రోజుల్లో 17,525మంది ఆయా నియోజకవర్గాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మన జిల్లాలో పనిచేస్తున్న ఇతర జిల్లాల ఉద్యోగులు 4350మంది కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.85ఏళ్ల పైబడిన వృద్ధులు, పోలింగ్‌కేంద్రాలకురాలేని దివ్యాంగులు 1,077 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఇంకా పోస్టల్‌బ్యాలెట్‌కు రాని ఉద్యోగులకు గురువారం మధ్యాహ్నం వరకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


చెవిరెడ్డి చేతకానితనంతో

చంద్రగిరి

పాతికేళ్ళు వెనుకబడింది

గత ఎన్నికలకు నాలుగు నెలల ముందు నియోజకవర్గ పార్టీ ఇంఛార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ స్వల్ప వ్యవధిలోనే ప్రభుత్వం నుంచీ రూ. 40 కోట్లు తెప్పించి అభివృద్ధి పనులు చేయించారు. ఎన్నికల్లో ఓటమి చెందినా నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా ఐదేళ్ళూ నియోజకవర్గంలోనే జనం మధ్యే గడుపుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచి కాపాడుకుంటున్నారు. బలమైన ప్రత్యర్థి ఎత్తుగడలకు దీటుగా సమాధానమిస్తున్నారు. ఓటరు జాబితా అక్రమాలపై, ఎన్నికల అక్రమాలపై పట్టువిడవకుండా పోరాడుతూ బాధ్యులకు చుక్కలు చూపిస్తున్నారు. ఆయనే చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ. పదేళ్ళ నుంచీ ఎమ్మెల్యేగా వున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డి చేతకానితనంతో చంద్రగిరి అభివృద్ధిలో పాతికేళ్ళు వెనకబడిపోయిందని ఆరోపిస్తున్న నానీ తనకు అవకాశమిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో పలు అంశాలపై ఆయన తన అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





■ ఇంటర్వ్యూ

● చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని

మచ్చలేని మనిషిని... కాబట్టే ప్రజల్ని ఓటడుగుతున్నా!

2018 అక్టోబరు 2019 జనవరి మధ్య కేవలం నాలుగు నెలల్లోనే చంద్రగిరి టీడీపీ ఇంఛార్జిగా రూ. 40 కోట్లు మంజూరు చేయించి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించా. గత ఎన్నికల్లో ఓడిపోయినా ఈ ఐదేళ్ళూ నియోజకవర్గంలోనే వున్నా. పార్టీ శ్రేణులకు నైతిక స్థైర్యం కల్పించా. కష్టం వచ్చినపుడు కార్యకర్తలను కాపాడుకున్నా. నిరంతరం గ్రామాల్లో తిరుగుతూనే వున్నా. ఇటు శ్రేణులకు, అటు ప్రజలకు అందుబాటులో వున్నా. ప్రజా సమస్యల మీద పోరాడుతున్నా. అధికార పార్టీ నేతల అక్రమాలను, అరాచకాలను ఎదుర్కొంటున్నా. నాలుగు నెలల్లోనే రూ. 40 కోట్లు తెచ్చిన నేను ఎమ్మెల్యేగా గెలిస్తే ఐదేళ్ళలో ఇంకెంత అభివృద్ధి చేయగలనో ప్రజలు ఆలోచించాలి. వీటన్నింటికీ మించి నా మీద ఎటువంటి మచ్చ లేదు. అదే సమయంలో అవినీతిమయంగా, గంజాయివనంగా చంద్రగిరిపై పడిన మరకను తుడిచేస్తా. అందుకే నాకు ఓటెయ్యాలని ప్రజల్ని ధైర్యంగా కోరగలుగుతున్నా.

చంద్రగిరిలో అభివృద్ధి స్తంభించింది

గత పదేళ్ళుగా చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి స్తంభించింది. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎలాంటి అభివృద్ధీ సాధించలేదు. పరిశ్రమలు రాలేదు. దీంతో తమకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరకడం లేదన్న అసంతృప్తి యువతలో వ్యక్తమవుతోంది. కనీసం తొండవాడలో జగనన్న కాలనీ కూడా పూర్తి కాలేదు. రైతులకు సబ్సిడీలు అందలేదు. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు తలకోన బ్యాక్ వాటర్స్‌ను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ భూములకు సాగునీరందించలేదు. ముఖ్యమైన రహదారులేవీ విస్తరణకు, అభివృద్ధికి నోచుకోలేదు. ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ సంస్థ కూడా ఏర్పాటు కాలేదు. సూటిగా చెప్పాలంటే ఎమ్మెల్యే చెవిరెడ్డి చేతకానితనంతో చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిలో పాతికేళ్ళు వెనకబడిపోయింది.

నాలుగేళ్ళలో చెవిరెడ్డి సంపాదన రూ. 5 వేల కోట్లు

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన కుటుంబీకులు గత ఐదేళ్ళలో తీవ్ర అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రజలకు చెందాల్సిన గ్రావెల్, ఇసుక దోచేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించారు. మఠం భూములు ఆక్రమించి అమ్ముకున్నారు. వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్ళలో కొవిడ్ కారణంగా ఏడాది మినహాయిస్తే మిగిలిన నాలుగేళ్ళలోనే ఎమ్మెల్యే చెవిరెడ్డి రూ. 5 వేల కోట్లు అక్రమంగా సంపాదించారు. అదంతా చంద్రగిరి ప్రజల సొత్తు. ఎర్రావారిపాలెం మండలంలో ఎర్రచందనం, రామచంద్రాపురం మండలం నడవలూరులో ఎర్రమట్టి, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో ఇసుక, తిరుపతి రూరల్‌లో ప్రభుత్వ, మఠాల భూములు... ఇలా అన్నింటినీ దోచుకున్నారు. నియోజకవర్గాన్ని అవినీతిమయం చేసేశారు.

సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తా!

ఎర్రావారిపాలెం మండలం ఆర్లపెంట ప్రాజెక్టు పూర్తి చేయిస్తా. చరిత్ర కలిగిన రాయలచెరువును రిజర్వాయర్‌గా మార్చడంతో పాటు దానివల్ల రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తా. రామచంద్రాపురం మండలం నుంచీ రాయలచెరువు నీటిని చంద్రగిరి మండలానికి మళ్ళించి పలు గ్రామాలకు సాగునీరందిస్తా. దామలచెరువు నుంచీ పాకాలకు సప్లై ఛానెల్ నిర్మాణంతో పాటు పాకాల మండలం గానుగపెంట పెద్ద చెరువుకు హంద్రీ-నీవా జలాల మళ్ళింపునకు ప్రయత్నిస్తా. తలకోన బ్యాక్ వాటర్స్ పింఛా ప్రాజెక్టుకు వెళుతున్నాయి. ఆ నీటిని మళ్ళించి ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల చెరువులు నింపుతాం.

అవినీతిరహిత చంద్రగిరిని ప్రజలు ఆశిస్తున్నారు!

ఐదేళ్ళుగా చంద్రగిరి నియోజకవర్గం తీవ్రస్థాయిలో అప్రతిష్ఠపాలైంది. ముఖ్యంగా వైసీపీ నాయకుల అవినీతి అరాచకాలతో నియోజకవర్గ పరువు పోయింది. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలతో యువత గంజాయికి బానిసలవుతున్నారు. దాంతో నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ, మఠాల భూముల కబ్జాలు ఎక్కువయ్యాయి. చదువుకున్న యువతకు ఉద్యోగాలు రావడం లేదు. ఉపాధి దొరకడం లేదు. రౌడీయిజం, దౌర్జన్యాలు మితిమీరాయి. ఒకప్పుడు ప్రశాంతతకు పేరుపడిన చంద్రగిరిలో ప్రస్తుత పరిస్థితి ప్రజలకు వేదన కలిగిస్తోంది. ఇపుడు జనం ఆశిస్తున్నదల్లా చంద్రగిరిని అవినీతి రహితం, గంజాయి రహితం, రౌడీ రహితం కావాలనే. అంతేకాకుండా సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో వుండే నిజాయితీపరుడైన ఎమ్మెల్యే కావాలని ఆశిస్తున్నారు. ఈ ఎన్నికలు చంద్రగిరి ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తాయన్న నమ్మకముంది.

చెవిరెడ్డి తాయిలాలెలా ఇస్తున్నారంటే...

గత పదేళ్ళుగా చంద్రగిరి ప్రజలు చెవిరెడ్డి తీరును గమనిస్తున్నారు. ఆస్తులమ్మి రోడ్డుపైకి వచ్చేశానని గత ఎన్నికల్లో చెప్పిన చెవిరెడ్డి రూ. కోట్లు ఖర్చు పెట్టి ప్రజలకు తాయిలాలు ఎలా ఇస్తున్నారు? ఇన్ని కోట్లు ఎలా సంపాదించారు? అపార్టుమెంట్లు, ఇళ్ళు వంటి రూ.వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయి? టీటీడీ కాంట్రాక్టర్ల ద్వారా ప్రజలకు స్వీట్లు పంచుతున్నారు. విద్యా సంస్థల యాజమాన్యాలను బెదిరించి పేదల పెళ్ళిళ్ళకు తాళిబొట్లు ఇస్తున్నారు. తుడా నిధులతో కుక్కర్లు అందజేస్తున్నారు. ఓ వాచ్ కంపెనీ వారికి దర్శనాలు చేయించి వారి ద్వారా చంద్రగిరి ప్రజలకు గోడ గడియారాలు పంపిణీ చేస్తున్నారు. మరో కంపెనీ వారికి దర్శనాలు చేయించి చీరలు, జాకెట్లు కానుకగా ఇస్తున్నారు. తాయిలాలకు పెడుతున్నది సొంత డబ్బు కానే కాదు.

అవకాశమిస్తే అభివృద్ధి అంటే చూపిస్తా

ఈ ఎన్నికల్లో ప్రజలు నాకు అవకాశమిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా. మల్లవరం-పనపాకం నడుమ ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయించి యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తా. వేదాంతపురం జంక్షన్ నుంచీ రాయలచెరువు వరకూ వందడుగుల రోడ్డు నిర్మాణం చేపడతాం. పాకాల, దామలచెరువులకు బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. పాకాల ప్రభుత్వాస్పత్రిని 24 గంటల ఆస్పత్రిగా స్థాయి పెంచి ఆ ప్రాంత ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తా. పాకాల రైల్వే జంక్షన్‌లో పార్సిల్ బుకింగ్‌కు సంబంధించి లోడింగ్, అన్ లోడింగ్ సదుపాయం పునరుద్ధరిస్తాం. దామలచెరువులో మ్యాంగో నగర్ విడిగా ఏర్పాటు చేయిస్తా. చిన్నగొట్టిగల్లులో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ నెలకొల్పడానికి ప్రయత్నిస్తా. చిన్నగొట్టిగల్లు నుంచీ ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద వరకూ డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా. ఎర్రావారిపాలెం మండలంలో కోల్డ్ స్టోరేజీ ప్లాంటు పెట్టించి టమోటా, చింత పండు రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తా.

ట్రిపుల్ టీ ఫార్ములాతో పర్యాటకాభివృద్ధి

చంద్రగిరి నియోజకవర్గంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయి. ప్రధానంగా ట్రిపుల్ టీ ఫార్ములాతో చంద్రగిరికి పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం చేస్తా. అందులో భాగంగా తిరుమల వచ్చిన యాత్రికులు తప్పనిసరిగా తిరుచానూరు, తలకోన ఆలయాలను, తలకోన జలపాతాన్ని సందర్శించేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధిపరుస్తా. అలాగే చంద్రగిరి కోటను కూడా మరింతగా అభివృద్ధి పరచడంతో పాటు పర్యాటకులను ఆకర్షించే పలు అంశాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తా.

వైసీపీలో బిగ్ వికెట్ డౌన్

సైకిలెక్కిన చంద్రగిరి సర్పంచ్, వార్డు మెంబర్లు, అనుచరులు



టీడీపీలో చేరిన రూపారామ్మూర్తి, అనుచరులు



అక్కగార్లకాలనీలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

చంద్రగిరి, మే 8: చంద్రగిరిలో తెలుగు దేశం పార్టీ క్యాడర్ ఫుల్ జోష్‌లో ఉంది. వైసీపీలో బిగ్ వికెట్ డౌన్ అయింది. చంద్రగిరి మండలంలో ఇప్పటికే వైసీపీ నుంచి ప్రముఖ నేతలంతా టీడీపీలో చేరిపోయారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి పంచాయతీ సర్పంచ్ ముదికుప్పం రూపారామ్మూర్తి, వార్డు మెంబర్లు రేఖ, సాబీర, సుదర్శన్‌కుమార్, వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రూపారామ్మూర్తి మాట్లాడుతూ వైసీపీలో ఇమడలేక పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. నానికి చంద్రగిరి పంచాయతీలో భారీ మెజారిటీ తీసుకొస్తామని చెప్పారు.

అక్కగార్ల కాలనీలో టీడీపీలో చేరిన 30 వైసీపీ కుటుంబాలు

చంద్రగిరి పంచాయతీలోని అక్కగార్ల కాలనీలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి అలియాస్ జేసీఆర్ ఆధ్వర్యంలో పులివర్తి నాని వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చిన పార్టీ తరపున అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైసీపీ నుంచి పంచాయతీ వార్డు మెంబర్ ప్రవీణ్‌కుమార్, శివ, సుబ్బు, రమేష్, యుగంధర్, సుధాకర్, అశోక్, నాగరాజు తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, టీడీపీ నాయకులు ఏవీ రమణమూర్తి, కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, గురుమూర్తిరెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శిగా మోహన్‌రెడ్డి

తిరుచానూరు, మే 8: టీడీపీ చిత్తూరు పార్లమెంటు జిల్లా కార్యదర్శిగా తిరుచానూరు మాజీ వార్డు మెంబరు మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం టీడీపీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ నియామకపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవిని కేటాయించిన అధ్యక్షుడు సీఆర్ రాజన్, చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీగా దొడ్ల కరుణాకర్‌రెడ్డి



చంద్రగిరి, మే 8: చిత్తూరు పార్లమెటు టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటకు చెందిన దొడ్ల కరుణాకర్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈసందర్భంగా దొడ్ల కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీలో తన సేవలను గుర్తించి తనను అధికార ప్రతినిధిగా నియమించినందుకు చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, టీడీపీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్టు

- విక్రయించిన సేల్స్‌మేన్ కూడా
- 55మద్యం సీసాలు, కారు సీజ్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

రామచంద్రాపురం, మే 8: ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా కారులో 55 మద్యం సీసాలు తరలిస్తున్న ఎన్ఆర్ కమ్మపల్లి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు మద్యం దుకాణం సేల్స్‌మేన్‌ను అరెస్టు చేసి, కారును సీజ్ చేసినట్లు పుత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రమణరాజు తెలిపారు. తిరుపతి-పచ్చికాపల్లం వేలాయుధంరెడ్డి నగర్ వద్ద మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తూ ఏపీ31 డీబీ2349 నెంబరు గల స్విఫ్ట్ కారును ఆపారు. అందులో గోనెసంచెలో 55మద్యం సీసాలు దొరికాయి. మద్యం తీసుకువస్తున్న ఎన్ఆర్ కమ్మపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ సాయిని అరెస్టు చేశారు. ఇతడికి మద్యాన్ని విక్రయించిన రామాపురం ప్రభుత్వ మద్యం దుకాణం సేల్స్‌మేన్ లోకనాథరెడ్డిని కూడా అరెస్టు చేసి పుత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు అప్పగించగా, కేసు నమోదు చేశారు.

ఏడుగురు 'ఉపాధి' ఫీల్డ్‌అసిస్టెంట్లకు షోకాజు

తిరుపతి రూరల్, మే 8: తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఈ నెల 1న షోకాజ్ నోటీసులు జారీచేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని కుంట్రపాకం, తనపల్లె, కొత్తూరు, తిరుచానూరు, రామానుజపల్లె, మల్లంగుంట, దుర్గసముద్రం గ్రామాల్లో చేపట్టిన ఉపాధిపనుల్లో టెక్నికల్ అసిస్టెంట్‌తో ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కై ఈ అక్రమాలకు పాల్పడ్డారన్న కారణంగా ఏపీడీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఏపీడీ షోకాజ్‌లపై స్పందించిన రూరల్ మండల ఎంపీడీవో వారిపై పూర్తిస్థాయి విచారణ చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని ఎంపీడీవో ఆదేశించినట్లు సమాచారం. కాగా గతంలోనూ మండలంలోని ఉపాధి హామీ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరిపిన అధికారులు టెక్నికల్ అసిస్టెంట్‌ని బదిలీ చేసి చేతులు దులుపుకోవడంతో.. ఫీల్డ్ అసిస్టెంట్లు పెట్రేగిపోతూ తిరిగి ఇటువంటి అవకతవకలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



మృతిచెందిన నరసమ్మ

పాకాల, మే 8: చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారిలోని పాకాల మండలం దామలచెరువు హైస్కూల్ గేటులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. దామలచెరువు పంచాయతీ పోలిశెట్టిపల్లెకు చెందిన నరసమ్మ (90) రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీ కొంది. చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఎస్సై మహేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీకి బిగ్ షాక్ / ● టీడీపీలో చేరిన పలు మండలాల నేతలు





టీడీపీలో చేరిన రణధీరపురం, దేవరకొండ వైసీపీ నాయకులతో పులివర్తి నాని

తిరుచానూరు/మంగళం/భాకరాపేట, మే 8: చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి బిగ్‌షాక్ తగిలింది. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వైసీపీ నేతలు బుధవారం తిరుచానూరు రఘునాథ రిసార్ట్స్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. రామచంద్రాపురం కొత్తకండ్రిగకు చెందిన వేమాని శేఖర్ నాయుడు, లెక్కల సుజయ్, నాదెండ్ల మోహన్ నాయుడు, లెక్కల రవి తదితరులున్నారు. వారికి నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా నెత్తకుప్పం నుంచి వైసీపీ నాయకులు భార్గవి, నాగమణి, సంపూర్ణమ్మ, పద్మ, గౌరవమ్మ తదితర వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. తిరుపతి రూరల్ మండలం సప్తగిరికాలనీకి చెందిన వైసీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథంతోపాటు పార్వతి, మాజీ వార్డుమెంబరు రమాదేవి తదితరులు టీడీపీలో చేరారు. తిరుపతి రూరల్ మండలం రణధీరపురం నుంచి వైసీపీ నాయకులు క్రాంతి, కిరణ్‌కుమార్, రవి, రాకేష్, తేజ, చందు, సుశీల, లత తదితరులు చేరారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండకు చెందిన శివకుమార్, త్రిమూర్తి, ఎనమలరెడ్డి తదితరులు, ఎర్రవారిపాళెం చింతగుంట నుంచి షాహిద్, కరీముల్లా తదితరులు పెద్దసంఖ్యలో పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. వారు మాట్లాడుతూ నాని విజయానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

తిరుపతి రూరల్, మే 8: ఓంశక్తి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. తిరుపతిలోని రామతులసి కళ్యాణ మండపంలో ఓంశక్తి భక్తబృందం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో నాని మాట్లాడుతూ.. తాను కూడా అమ్మవారి భక్తుడినని, ఎన్నికల తర్వాత ఆలయ నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. చంద్రగిరిని గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దడంతోపాటు అవిలాల, గాంధీపురంలోని ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఆయన కోరారు. టీడీపీనేత మబ్బు దేవనారాయణరెడ్డి, ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులివర్తి నాని

దొంగ ఓట్ల పోలింగ్‌కు అనువుగా బూత్‌లు!

- చెవిరెడ్డి కోరిక మేరకే తుమ్మలగుంటలో కేంద్రాల పెంపు: సుధారెడ్డి



పోలింగ్‌బూత్‌ను చూపుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుపతి రూరల్, మే 8: 'చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి స్వగ్రామం తుమ్మలగుంటలో దొంగ ఓట్ల పోలింగ్‌కు అనువుగా రెండు కేంద్రాలను(210, 211) ఏర్పాటు చేసుకున్నారు. పైగా ఎటువంటి సౌకర్యం, రక్షణ లేని రేకులషెడ్డుల్లో వీటిని ఏర్పాటు చేశారు' అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి మండిపడ్డారు. బుధవారం టీడీపీ నేతలతో కలసి తుమ్మలగుంటలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 2019లో ఇదే పంచాయతీలో నాలుగు పోలింగ్ బూత్‌లుండగా.. ఇపుడు ఏడుకు పెంచేశారని ఆరోపించారు. ప్రత్యేకించి రామానుజపల్లె, ఉప్పరపల్లె ఓటర్లకు ఆ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లు ఉండేవన్నారు. ప్రస్తుతం ఇక్కడి ఓటర్లను మూడు కిలోమీటర్ల దూరంలోని తుమ్మలగుంటలోని 210, 211, 215 బూత్‌ల్లోకి మార్చడంతో వీరంతా జాతీయ రహదారిని దాటుకుని రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తుమ్మలగుంట గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్ల కరుణాకర్‌రెడ్డిలతో సెక్టార్ ఆఫీసర్ మురగయ్యకి ఆమె ఫిర్యాదు చేశారు. 2019లో ఇదే పోలింగ్ బూత్‌ల్లో రిగ్గింగ్ చేస్తున్నారని తెలిసి వెళ్లిన తనపై ఎమ్మెల్యేతోపాటు ఆయన కుటుంబీకులు భౌతికదాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈసారీ రిగ్గింగ్ చేయాలనుకుంటున్నారని, నాని తరఫున జనరల్ ఏజెంట్‌గా తానే వస్తానని, దాడిచేసినా సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు రేపటివరకు తత్కాల్ గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), మే 8: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఇంటర్ విద్యామండలి శుక్రవారం వరకు పొడిగించింది. ఈ మేరకు మండలి తిరుపతి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

కొత్త ఓటర్ల సంఖ్య 41,993

తిరుపతి(కలెక్టరేట్), మే 8: జిల్లాలో ఈదఫా ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు 41,993 మంది తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 18,12,980 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,83,330, మహిళా ఓటర్ల సంఖ్య 9,29,466గా ఉంది. ఇతర ఓటర్లు (ట్రాన్స్‌జెండర్స్)184మంది, సర్వీసు 862, ఎన్ఆర్ఐ 291, దివ్యాంగులు 24,596, 85ఏళ్లు దాటిన ఓటర్లు 7,924మంది ఉన్నారు. పెరిగిన ఓటర్లలో 90శాతంపైగా తొలిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లే కావడం గమనార్హం. చంద్రగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 3,15,159మంది ఓటర్లు ఉండగా.. సత్యవేడులో అత్యల్పంగా 2,15,385మంది ఓటర్లు ఉన్నారు.







చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించాలంటూ దుర్గసముద్రంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, కావలివారిపల్లెలో తెలుగు మహిళ నేత సావిత్రి, రాయలచెరువుపేటలో తిరుమలరెడ్డి ప్రచారం

టీడీపీ విజయకేతనం ఖాయం



ప్రచారం చేస్తున్న సీఆర్ రాజన్

తిరుచానూరు, మే 8: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ విజయకేతనం ఖాయమని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. బుధవారం యోగిమల్లవరంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో తిరుచానూరు పంచాయతీలో విచ్చలవిడిగా గంగజాయి విక్రయాలు, భూకబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. చంద్రగిరిలో అన్ని పదవులు చెవిరెడ్డి కుటుంబ సభ్యులకే కేటాయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్ రెడ్డి, మునిరత్నం, సాల్మన్ రాజు, పెరుమాళ్, నీలకంఠం, డిస్కో శివ, హరిరామ్‌రెడ్డి, కలీమ్, రమణరాయల్, కృష్ణ, ఉమాపతి, దిలీప్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నిదురపో కన్నా.. పట్టు పరుపు లేకున్నా..



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో బుధవారం కూరగాయల తోపుడుబండిపై ఉన్న క్రేట్‌లో ఆదమరిచి నిద్రపోతున్న ఓ చిన్నారి

తిరుపతి

కోడి బొచ్చు కథేంటి?

● నగరంలో చర్చగా మారిన జనసేనాని పవన్ ఆరోపణ

'కోడి బొచ్చును కూడా నెలకు రూ.20లక్షలకు అమ్ముకునే కరుణాకరరెడ్డి, వారి అబ్బాయి అభినయరెడ్డి మనకు ఎమ్మెల్యేలుగా కావాలా?' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళవారం రాత్రి తిరుపతిలో జరిగిన రోడ్ షోలో చేసిన ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఇంతకీ కోడి బొచ్చు కథేంటి? అంటూ నగరంలో పలువురు తెలుసుకోవడం మొదలుపెట్టారు. దీంతో కోడి బొచ్చు అంటే.. చికెన్ వేస్ట్ అని తెలుసుకున్నారు. 'చికెన్ వేస్ట్' మాఫియాతో వైసీపీ నేతల హస్తం ఉందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. మరోవైపు పవన్ వ్యాఖ్యలను వైసీపీ నేతలు ఖండించక పోవడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది.ఈవ్యవహారంపై ఆరా తీయగా చికెన్ వేస్ట్ కూడా అధికార పార్టీ నేతలకు లక్షల్లో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నట్టుగా తెలుస్తోంది.

ఇలా మాఫియా చేతుల్లోకి..

కొన్నేళ్ల క్రితం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. దీనికోసం చికెన్ స్టాల్స్ యాజమాన్యం మున్సిపల్ సిబ్బందికి కొంత మొత్తం ముట్టచెప్పాల్సి వచ్చేది. డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని వారు వ్యర్థాలను నిర్మానుష్య ప్రాంతాల్లో పడేసేవారు. తిరుపతితోపాటు సమీప జిల్లాల్లోని చేపల చెరువులు, పందులకు ఆహారంగా వీటిని వినియోగిస్తూ వచ్చేవారు. దీంతో కొందరు రంగంలోకిదిగి చికెన్ స్టాల్స్ యాజమాన్యాన్ని సంప్రదించి, మీకు ఎలాంటి శ్రమ లేకుండా తామే వేస్టును ఉచితంగా తీసుకెళతామని చెప్పడంతో షాపుల నిర్వాహకులు అంగీకరించి, వారికి ఇవ్వడం మొదలుపెట్టారు. పైగా తమకు తెలియకుండా ఏ ఒక్క షాపుకూడా చికెన్ వేస్ట్ ఇవ్వకూడదని మున్సిపల్ అధికారులను అడ్డుపెట్టుకుని ఆదేశించారు. ఈక్రమంలో గతంలో తీసుకెళ్లేవారు గొడవలకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా పాతవాళ్లకే ఇస్తే, మున్సిపల్ అధికారులతో దాడులు చేయించి దారిలోకి తెచ్చుకునేవారు.

గాలికొదిలేసిన కార్పొరేషన్

వాస్తవానికి వ్యర్థాలు నగరపాలక సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టేలా ఉండాలి. టెండర్ ద్వారా ఏదైనా ఏజెన్సీకి అప్పగించి చికెన్ వేస్టును తీసుకెళ్లే చేయాలి. వారు దానిని వెట్ వేస్ట్ ప్రాసెసింగ్ చేసి.. జంతువులకు ఆహారంగా (మీట్ మీల్) వినియోగిస్తారు. ఒక కిలో కోడి వ్యర్థాల నుంచి 300 గ్రాముల మీట్‌మీల్ వస్తుంది. కొన్ని కార్పొరేషన్లలో ఇలాంటి విధానం జరుగుతోంది కూడా. తిరుపతి నగరపాలక సంస్థ మాత్రం అలాంటి పనిచేయకుండా అధికార పార్టీ వర్గానికి సహకరించడమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఏమిటీ చికెన్ వేస్ట్

చెత్తలో కలిసిపోయే కోళ్ల వ్యర్థాలు కూడా వైసీపీ నేతలకు కాసులు కురిపిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. కోళ్లను కోసిన అనంతరం వ్యర్థంగా పడేసే భాగాలను ప్రత్యేక వాహనాల ద్వారా కొందరు చేపలు చెరువులు, పందులకు ఆహారంగా తరలిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వీరు ప్రత్యేక వాహనాల్లో చికెన్ షాపుల వద్దకు చేరుకుంటారు. వాహనంలో ముందుగానే ఏర్పాటు చేసుకున్న భారీ ప్లాస్టిక్ డ్రమ్ముల్లో కోళ్లనుంచి తీసిన పేగులు, తల, కాళ్లు, చర్మం, ఈకలు సేకరిస్తారు. ఇలా ఒక్కో ట్రిప్పునకు సుమారు నాలుగు టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నట్టుగా తెలుస్తోంది. వ్యర్థాలను తిన్న చేపలను మనుషులు తింటే క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్న మాట.

నాది కష్టార్జితం.. నీది అక్రమార్జితం

నేను వ్యాపారం చేసి, కాంట్రాక్టర్‌గా ఎదిగా - నువ్వే పని చేశావని వేలకోట్లు పోగేశావు?

రోడ్ షోతో మతిపోయి మాట్లాడుతున్నాడు - భూమనపై కూటమి నేతలతో కలిసి ఆరణి ధ్వజం

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): నేను ఆకు కూరలు అమ్మేవాడినని కరుణాకరరెడ్డి విమర్శలు చేశాడు. నిజమే.. నాది వ్యవసాయ కుటుంబం. పంటలు అమ్ముకోవడం రైతు ధర్మం. నేను వ్యాపారాలు చేసి, కాంట్రాక్టర్‌గా ఎదిగి కష్టపడి సంపాదించా. నువ్వే పని చేశావని వేలకోట్ల రూపాయలు పోగేశావు. సెటిల్మెంట్లు, కబ్జాలు, గంజాయి అమ్మకాలతో సంపాదించిన అవినీతి, అక్రమార్జన సొమ్ము నీది. కాదని శ్రీవారిపై ప్రమాణం చేసే దమ్ము ఉందా?' అంటూ భూమనపై ఎన్డీఏ కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బుధవారం కూటమి నాయకులతో కలిసి ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఆరణి మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల రోడ్ షో, బహిరంగ సభ విజయంతం కావడంతో భూమనకు మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. తిరుపతి ప్రజలకు ఏమి చెప్పాలో ప్రజాగళంలో ప్రకటించారని తెలిపారు. రోడ్ షో, బహిరంగ సభ విజయవంతం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతోపాటు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో తిరుమల, తిరుపతి ప్రతిష్టను తండ్రీ కొడుకులు ఏవిధంగా దెబ్బతీశారో పవన్, బాబులు వివరించారని చెప్పారు. కొద్దిరోజులుగా తనపై కరుణాకర రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఐదు వేల రూపాయలతో కాంట్రాక్టర్ జీవితాన్ని ప్రారంభించి 45 ఏళ్ల జేఎంసీ ప్రస్థానంలో మూడు వందల కోట్ల రూపాయల టర్నోవర్ కంపెనీని తీర్చిదిద్దినట్లు వివరించారు. భూమన కుటుంబం మాత్రం దౌర్జన్యాలు, 15శాతం కమీషన్, గంజాయి అమ్మకాలతో కోట్ల రూపాయలు సంపాదించిందని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం పేరుతోనూ వేల కోట్లు దోచుకున్న కరుణాకరరెడ్డి అవినీతికి పాల్పడలేదని శ్రీవేంకటేశ్వర స్వామిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. భూమన అవినీతిపరుడని తాను ప్రమాణం చేయడానికి రెడీ అని సవాల్ చేశారు. అలాగే కరుణాకర రెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలపై కాణిపాకం వరసిద్ధి వినాయకుడిపై ప్రమాణానికి తాను సిద్ధమని ప్రకటించారు. మరో ఐదురోజుల్లో జరగనున్న ఎన్నికల్లో భూమన కుటుంబానికి రాజకీయ సమాధి కట్టడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ.. తిరుపతి ప్రశాంతతను, తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసిన భూమన కుటుంబాన్ని ఏ ఎన్నికల్లోనూ ప్రజలు గెలిపించరని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై కరుణాకర రెడ్డి చేసిన విమర్శలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకుడు అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఐదేళ్లలో తిరుమలలో దేవుడి సొమ్ము అవినీతిపై ఎన్డీఏ ప్రభుత్వం విచారణ జరిపి చట్టపరంగా శిక్షిస్తామని తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. ఏ పార్టీ అధ్యక్షులైనా ప్రచారం నిర్వహించి వెళ్లడం ఆనవాయితీ అని, కానీ కొడుకు ఓడిపోతాడనే భయంతో కరుణాకర రెడ్డి విమర్శలు చేశారని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుపతి నియోజకవర్గ పరిశీలకులు లక్ష్మీపతి, తిరుపతి అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

జయహో జనసేన

ఆరణి గెలుపుకోసం కిరణ్‌రాయల్ ప్రచారం


కిరణ్‌రాయల్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న పవన్ అభిమాని

తిరుపతి అర్బన్, మే 8: జయహో జనసేన అంటూ ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం ఒకటో డివిజన్‌లోని యాదవకాలనీలో ప్రచారం చేశారు. ఆరణి గెలుపు తథ్యమని, త్వరలోనే తిరుపతికి ప్రశాంతత రానుందని, అరాచక పాలన కొద్ది రోజులేనని, గాజుగ్లాసు గుర్తుపై ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు రోడ్‌షో, బహిరంగ సభను చూసి ఓర్వలేక వైసీపీ పిచ్చికూతలు కూస్తోందని మండిపడ్డారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు. ఈ సందర్భంగా కిరణ్‌ను పవన్‌కల్యాణ్ అభిమాని ఆప్యాయంగా పలకరించి.. అధికారంలోకి రాబోతున్నాం, అందరికీ మంచి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ, సుధీర్, భాను, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.02 కోట్లు

తిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.02 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కించి, బుధవారంఉదయం ప్రకటించింది. మంగళవారం65,146మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,306 మంది తలనీలాలు సమర్పించారు.

22న శ్రీనృసింహ జయంతి: శ్రీవారి ఆలయంలో ఈనెల 22న నృసింహజయంతి జరుగనుంది. ఏటా వైశాఖమాసం స్వామి నక్షత్రంలో నృసింహజయంతిని నిర్వహిస్తారు. యోగనరసింహస్వామి మూలమూర్తికి ఈసందర్భంగా అభిషేకం చేస్తారు. వైశాఖ మాస ఉత్సవాల్లో భాగంగా తిరుమల వసంతమండపంలో మధ్యాహ్నం3 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నరసింహస్వామి వారి పూజనిర్వహిస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేయనున్నారు.

పాలిసెట్ ఫలితాల్లో 'విశ్వం' ప్రతిభ



తిరుపతి(విద్య), మే 8: పాలిసెట్ ఫలితాల్లో విశ్వం విద్యాసంస్థల్లో శిక్షణ పొందిన పలువురు ఈఏడాది కూడా అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఛైర్మన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. కె.సాహిత్ 120కి 118మార్కులతో జిల్లా మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. సి.తన్మయి, కె.నిత్యశ్రీకళ్యాణి, ఎం.విఘ్నేష్ 106 మార్కులతో సత్తా చాటారన్నారు. లక్ష్మీశ్రీవర్ధన్, సంతోష్, హేమశ్రీ, గీతిక, గురువిక్రమ్, ధర్షితప్రియ, సాయిశ్వేత, నిఖిలేశ్వర్, నవదీప్, మోహిత్‌లు కూడా టాప్‌మార్కులు సాధించారని వివరించారు. పలువురు విద్యార్థులు మ్యాథ్స్‌లో 50కి50, ఫిజిక్స్‌లో 40కి40, కెమిస్ట్రీలో 30కి29మార్కులు పొందారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ తులసివిశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

శ్రీగగనలో..



రాజన్న పార్క్ సమీపంలో ఉన్న శ్రీగగన ఇంజనీర్స్ అకాడమీ విద్యార్థులు కూడా జిల్లాస్థాయిలో అత్యుత్తమ ఫలితాలతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించారని డైరెక్టర్ ఎ.కరుణామూర్తి పేర్కొన్నారు. ఎం.విఘ్నేష్ 86మార్కులతో రాష్ట్రస్థాయిలో 3,504ర్యాంకు, పి.యతీష్‌రాజ్ 78 మార్కులతో 5,666 ర్యాంకు సాధించి ప్రతిభ చాటారని తెలిపారు. అలాగే వివిధ కేటగిరీల్లో పలువురు విద్యార్థులకు మంచి బ్రాంచిలలో సీట్లు పొందే ర్యాంకులు వచ్చాయన్నారు.

శ్రీవారి సేవకు కరుణాకర రెడ్డి తగడు

● కూరగాయల మార్కెట్‌నూ లూటీ చేశారు
● కూటమి ప్రభుత్వంతో మార్కెట్‌కు మహర్దశ
● జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు


కూరగాయల మార్కెట్లో ప్రచారం నిర్వహిస్తున్న ఆరణి

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి స్వామి సేవకు టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి తగడని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అన్నారు. దౌర్జన్యాలు, కబ్జాలు, గంజాయి అమ్మకాలతో భూమన వేల కోట్ల రూపాయలు సంపాదించాడని ఆరోపించారు. బుధవారం అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి, టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. మార్కెట్ వ్యాపారులు ఘన స్వాగతం పలకగా, గాజు గ్లాసుపై ఓటేసి గెలిపించాలని ఆరణి కోరారు. మార్కెట్‌లో తాగునీటి సమస్యను తమ ప్రభుత్వం వచ్చిన రెండునెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యాపారుల కోసం షెడ్లను కట్టించనున్నట్లు చెప్పారు. గేట్ రేటును వైసీపీ నాయకులు పెంచేశారని, ప్రభుత్వ ధరనే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, నాయుడమ్మ, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, జనసేన నాయకులు లక్ష్మీపతి రాయల్, మాధవరం, అన్నారెడ్డి కృష్ణా రెడ్డి, జానకిరామ్‌రెడ్డి, బీఎస్ బాలాజి, ప్రకాష్, సాంబ, శివకుమార్ పాల్గొన్నారు.

వైసీపీనుంచి టీడీపీ, జనసేనలోకి వలసలు: మాజీ ఎమ్మెల్యే మోహన్, ఊకా విజయకుమార్ ఆధ్వర్యంలో ఆరణి సమక్షంలో వైసీపీ నాయకుడు జంగం శ్రీనివాసులు జనసేనలో చేరారు. అతనితో సురేష్, నాగరాజు, ప్రవీణ్, అనిల్, మోహన్, రంగా, 29వ డివిజన్ నుంచి రత్నమ్మ, రాజేంద్ర, పురుషోత్తం, అచ్యుత్ రెడ్డిలతోపాటు రెండు వందల మంది కూటమి పార్టీలో చేరారు. ఆరణి గెలుపునకు కృషి చేస్తామని జంగం శ్రీనివాస్ చెప్పారు. ఈకార్యక్రమంలో కట్టా జయరాం యాదవ్, యాదవ కృష్ణ, నైనార్ శ్రీనివాసులు, మునికృష్ణ, రాజేష్, సరితా నాగరాజు, బండ్ల లక్ష్మీపతి రాయల్, ప్రవీణ్, జంగం గురుకుమార్ పాల్గొన్నారు. అలాగే చెన్నారెడ్డి కాలనీకి చెందిన బిల్డర్ ఈశ్వర ప్రసాద్ జనసేనలో చేరారు.


జనసేన, టీడీపీలో చేరిన నాయకులతో ఆరణి శ్రీనివాసులు, ఊకా విజయకుమార్

తిరుపతిని అవినీతిమయం చేస్తున్న వైసీపీ: చింతా మోహన్



తిరుపతి(కపిలతీర్థం), మే 8: పవిత్రమైన తిరుపతిని వైసీపీ నేతలు అవినీతిమయం చేస్తున్నారని తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ మండిపడ్డారు. టీటీడీ పరిపాలన భవనం సమీపంలో ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పల్లెవీధిలో వైసీపీ నేతలు ఒక్కో ఓటుకు రూ.5వేల చొప్పున పంచిపెట్టారని, ఆ డబ్బు సీఎం జగన్ ఇచ్చారా... టీటీడీ కాంట్రాక్టర్లు ఇచ్చారా లేక మున్సిపాలిటీ నుంచి వచ్చిందా.. వైసీపీ అభ్యర్థి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బహిరంగంగా డబ్బులు పంచుతుంటే ఎన్నికల అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. నేతలు గోపి, భానుప్రకాష్, నాగరాజు, శాంతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (జీవకోన), మే 8: గిరిజనసంక్షేమ గురుకుల పాఠశాలల్లో(ఆంగ్ల మాధ్యమం) ప్రవేశాలకు అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి సూర్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. లాటరీ పద్ధతిలో మూడో తరగతిలో (అన్ని వర్గాల వారికి) ప్రవేశం కోసం, నాల్గవ తరగతి నుంచి 9వ తరగతి వరకు (గిరిజన విద్యార్థులకు మాత్రమే) బ్యాగ్‌లాగ్ సీట్లకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గూడూరు, గొట్టిప్రోలు(నాయుడుపేట), కోట, వెంకటగిరి, చెన్నూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరులోని గురుకుల పాఠశాలల్లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు ప్రిన్సిపాల్‌కు అందజేయవచ్చన్నారు. సీట్లకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఈనెల 30న స్థానిక జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. గూడూరు (94417 66714), గొట్టిప్రోలు (94914 35025), కోట (94419 37594), వెంకటగిరి (94932 53578), చెన్నూరు (94417 36136), తిరుపతి (94403 40221), శ్రీకాళహస్తి (94404 46116), పుత్తూరు (94924 44838) నెంబర్లను సంప్రదించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ పరిశోధకుడు సి.రంగనాయకులు డాక్టరేట్ పొందారు. యుటిలైజేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సోర్సెస్ బై రీసెర్చ్ స్కాలర్స్‌అండ్‌పీజీ స్టూడెంట్స్ ఇన్ బయోలాజికల్ సైన్స్ ఎ స్టడీ ఇన్ ద సెలెక్టెడ్ యూనివర్సిటీస్ ఆఫ్ఏపీ అంశంపై ప్రొఫెసర్ సురేంద్రబాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీతఈ దామ్లానాయక్ తెలిపారు.


రంగనాయకులు

గంగమ్మ జాతరను వేడుకగా నిర్వహిద్దాం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మే 8: తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన తాతయ్యగుంట గంగమ్మజాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 14న ప్రారంభమై 22వ తేదీతో ముగిసే గంగమ్మజాతరను వేడుకగా నిర్వహించాలని.. భక్తులు ఇబ్బందిపడకుండా అన్నిశాఖలు సమన్వయంతో జాతర ఏర్పాట్లు చేపట్టాలన్నారు. 14న మంగళవారం చాటింపు, 15న బైరాగి వేషం, 16న బండ వేషం, 17న తోటి వేషం, 18న దొర వేషం, 19న మాతంగి వేషం, 20న సున్నపు కుండలు, 21న గంగమ్మ జాతర చప్పరం, 22న విశ్వరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల సంక్షేమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 8: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని విమర్శించారు. బీసీలు అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. మునిరత్నంరెడ్డి, సుబ్బుయాదవ్, మునికృష్ణారెడ్డి, మహేశ్వరి, గోవిందరాజులు, సుధాకర్, సురేష్ యాదవ్, విజయ్, గోపీ పాల్గొన్నారు.

ఫేక్ ఓటరని తేలితే క్రిమినల్ కేసులు పెడతాం: ఆర్వో

తిరుపతి అర్బన్, మే 8: పోలింగ్ స్టేషన్‌లో ఫేక్ ఓటరని తేలితే క్రిమినల్ కేసులు పెడతామని తిరుపతి నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) అదితిసింగ్ స్పష్టం చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 86 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, సీఆర్పీఎఫ్ బలగాలతో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామన్నారు.

ఓటర్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్): ఓటర్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఎన్నికల విధుల నిర్వహించాలని చంద్రగిరి నియోజకవర్గం ఆర్వో, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో చంద్రగిరి సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలిచ్చారు.

ప్రధానమంత్రి మోదీకి సాదర వీడ్కోలు

రేణిగుంట, మే 8: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రేణిగుంటలోని విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అన్నమయ్య జిల్లా కలికిరిలో జరిగిన ఎన్నికల ప్రచారసభకు హెలికాప్టర్‌లో ప్రధాని బయల్దేరి వెళ్లారు. అక్కడినుంచి సాయంత్రం తిరిగి విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయల్దేరి వెళ్లారు. బీజేపీ నేతలు సాదర వీడ్కోలు పలికారు.

నాగబాబును కలిసిన ఆరణి



తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబును బుధవారం తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కలిశారు. పోల్‌మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టాలని నాగబాబు సూచించారు.

మహిళలతో ఆత్మీయ సమావేశం



తిరుపతి, మే8 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డి కాలనీలోని మహిళలతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు, ముఖ్యంగా మహిళాశక్తి పథకం ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా సుగుణమ్మను మహిళలు సత్కరించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, మే8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు మంత్రి రామచంద్రన్, ఇండియన్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.


నైనా జైస్వాల్

ఎంసీబీ ట్రిప్ వల్లే వీధి దీపాలు వెలగలేదు : ఎస్ఈ

తిరుపతి(ఆటోనగర్), మే 8: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారంరాత్రి రోడ్‌షో సందర్భంగా మంగళం రోడ్డులో విద్యుత్ దీపాలకు సరఫరా నిలిపి వేసినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయని తిరుపతి విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. వీధి దీపాల నిర్వాహణ బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉంటుందని, వారు ఏర్పాటు చేసిన ఎంసీబీ ట్రిప్ కావడంతో కొంత సమయం ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలగలేదన్నారు. సమస్యను వారు గుర్తించి.. ఎంసీబీ స్విచ్ ఆన్‌చేసి విద్యుత్ దీపాలు వెలిగించారన్నారు. ఈ విషయంలో సదరన్ డిస్కం పొరపాటు లేదని వివరణ ఇచ్చారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబరు 1912కు కాల్ చేస్తే త్వరగా పరిష్కరిస్తారన్నారు.

సైన్స్ కాలేజ్ డే

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 8: శ్రీనివాసా ఆడిటోరియంలో ఎస్వీయూనివర్సిటీ సైన్స్ కాలేజ్ డే బుధవారం నిర్వహించారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సైన్స్ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్రా మాట్లాడుతూ.. సైన్స్ రంగంలో వస్తున్న నూతన పరిణామాలను విద్యార్థులు అవగాహన చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది కాలంలో సైన్స్ కాలేజీ ప్రగతిని వివరించారు. రిజిస్ట్రార్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: వరప్రసాద్



సభా ప్రాంగణంలో బీజేపీ నాయకులతో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - ప్రధాని మోదీకి వరప్రసాద్ అభివాదం

తడ, మే 8 : అన్నమయ్య జిల్లా కలికిరిలో జరిగిన బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి బహిరంగ సభలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు పాల్గొన్నారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మాజీ సీఎం, రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్న బహిరంగసభకు వరప్రసాద్ హాజరయ్యారు. తనను ప్రధానికి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ బహిరంగసభలో వారితోపాటు టీడీపీ నాయకుడు ఎల్.రమణ, జనసేన నాయకుడు నాగేంద్రబాబు, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


సభికులకు అభివాదం చేస్తున్న వరప్రసాద్ తదితరులు

జన కేతనం

గురువారం 9 మే 2024

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

ఆర్భాటపు నేత


ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఏది చేసినా ఆర్భాటం, హడావుడి ఆకాశాన్నంటుతుంది. కరోనా సాయం అయినా, దేవుడి ఉత్సవం అయినా ప్రదర్శనకే ప్రాధాన్యం ఇస్తారు.

- ఊరందూరులో ఒక మహానగరమే రాబోతోందంటూ సీఎంతో ఇళ్ల కాలనీకి శంకుస్థాపన చేసిన తీరు అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడక్కడ కనీస సదుపాయాలు కూడా లేక పది కుటుంబాలే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాయి.
- ఇనగలూరు వద్ద అపాచీ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామంటూ ఊరూవాడా హోరెత్తించారు. సీఎం జగన్ స్వయంగా వచ్చి 2022 జూన్ 23వ తేదీన భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఆ మరుసటి రోజే శిలాఫలకం అదృశ్యమైంది. పరిశ్రమ నెలకొల్పే పనులు కనీసంగా కూడా మొదలు కాలేదు.

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ప్రజా దర్బార్‌ల గురించి జనం కథలు కథలుగా చెప్పుకుంటారు. ఎవరు ఏ పనితో వచ్చినా పలకరించి కూర్చోబెట్టి వింటారు. అర్జీ తీసుకుని అనుచరులకు అప్పగిస్తారు. పనులపై వచ్చినవారు ఆయన రిసీవింగ్‌కి సంబరపడిపోతారు. అంతే.. ఆ తర్వాత అతీగతీ ఉండదు. ఆయన దర్బార్ దీనికే పరిమితం కాదు. మాట వినని, దారికి రాని వారి సంగతి తేల్చే పనులూ అక్కడే పురమాయిస్తారని చెబుతారు. శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయాన్నే అవినీతితో అపవిత్రం చేసేసిన ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదనరెడ్డి గురించి జనం చెప్పుకుంటారు. ఆయన అనుచరగణం రౌడీయిజం గురించి, దౌర్జన్యాల గురించి ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా స్పందించరు. తన స్టయిలే వేరన్నట్టుగా వ్యవహరిస్తారు. ఈ ఐదేళ్లూ ఆయన రాజకీయ, పాలనా శైలి, అభివృద్ధి అంటని తీరూ... ఎన్నికల వేళ చర్చగా మారాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రౌడీ దర్బార్



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి స్టయిలే వేరు.

ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యం

భూకబ్జాలు.. ఇసుక దోపిడీ

- నియోజకవర్గంలో మట్టి, ఇసుక, గ్రావెల్, మద్యం వంటి అక్రమ వ్యాపారాలతో ఎమ్మెల్యే రూ. కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి.
- నియోజకవర్గంలో ఎక్కడా ప్రభుత్వ పోరంబోకు, బంజరు భూములు మిగల్చలేదన్న ఆరోపణలు వచ్చాయి. వాటిల్లో వెంచర్లు వేసి, ప్రైవేటు సంస్థలకు విక్రయించి భారీగా సంపాదించారనే ఆరోపణలున్నాయి.

ముక్కంటి వెండిని దోచేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, భార్య, అత్త కలిసి ఆలయం నుంచి వెండిని అక్రమంగా బెంగళూరుకు తరలించి అమ్మేస్తున్నారని ఎమ్మెల్యే అనుచరుడు హేమచంద్రారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. వెండికి సంబంధించిన రూ.10 లక్షల నగదు తన ఖాతాకు జమ చేసినట్లు తెలియజేశారు. లాక్‌డౌన్ సమయంలో మద్యం దుకాణాల నుంచి తరలించి సొమ్ముచేసుకున్నారని కూడా ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు కూడా చేయడం సంచలనం అయ్యింది.

శ్రీకాళహస్తి ప్రజల చెవిలో పూలు



హామీ: మన్నవరంలో ఎన్‌టీపీసీ-భెల్ పరిశ్రమను పూర్తి చేయించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.
అమలు: ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోనేలేదు.

హామీ: సోమశిల స్వర్ణముఖి లింకు కాలువను పూర్తి చేసి రైతులకు అంకితమిస్తాం.
అమలు: టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప కనీసం ఒక్క అడుగు కూడా కాలువ పనులు జరగలేదు.

హామీ: శ్రీకాళహస్తి మున్సిపల్ వార్డుల్లోనూ, గ్రామాల్లోనూ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు పెట్టి శుద్ధజలం సరఫరా చేస్తాం.
అమలు: ఆ దిశగా కనీస ప్రయత్నం చేయలేదు.

హామీ: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్విమ్స్ తరహాలో వైద్య సేవలు అందిస్తాం.
అమలు: ప్రభుత్వ ఆస్పత్రిలో అదనపు అంతస్తు నిర్మించి చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమీ లేదు.

హామీ: శ్రీకాళహస్తిలో మెడికల్ కాలేజీ నెలకొల్పుతాం.
అమలు తీరు: ఐదేళ్లలో ఎక్కడా ఆ ప్రస్తావన కూడా తీసుకురాలేదు.

హామీ: స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను జేఎన్టీయూకు అప్పగించి మరింత అభివృద్ధి చేస్తాం.
అమలు: ఎమ్మెల్యేగా గెలిచాక స్కిట్ కళాశాల పూర్తిగా మూతపడింది.

హామీ: స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేసి, సుందరీకరణ చేస్తాం.
అమలు: ఐదేళ్లూ కాలక్షేపం చేసి, ఎన్నికల షెడ్యూలు వెలువడే ముందు శంకుస్థాపన చేసి హడావిడి చేశారు. పనులు మాత్రం మొదలు కాలేదు.

దాడులు.. దౌర్జన్యాలు

శ్రీకాళహస్తిలో ఈ ఐదేళ్ళలో రౌడీయిజం, దాడులు, పెరిగిపోయాయి. ఎమ్మెల్యే అనుచరగణం దబాయింపులకూ, దౌర్జన్యాలకూ అంతులేదు.

- టిఫిన్ సెంటర్ నడుపుకునే మునిరాజమ్మను యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ పలకరించారు. ఆమె తన సమస్యలు చెప్పుకుంది. ఇవి మీడియాలో రావడంతో వైసీపీ నేతలు దాడి చేశారు. టిఫిన్ అంగడి ధ్వంసం చేశారు. ఎదురు ఆమె మీదే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.
- ఎమ్మెల్యే తన ఆస్తులు గుంజుకున్నారని, ఆయనతో తనకు ప్రాణహాని వుందని స్వయంగా ఎమ్మెల్యే భార్య సోదరుడు సామాను శ్రీధర్‌రెడ్డి మీడియా సమావేశంలో ఆరోపించారు.
- నియోజకవర్గంలోని పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి వాటాలు వసూలు చేశారని, ట్రాన్స్‌పోర్టులు, ఉద్యోగాల నియామకం వంటి కాంట్రాక్టులు బలవంతంగా దక్కించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఓ ప్రముఖ పరిశ్రమ విషయంలో వేధింపులకు దిగారని, యాజమాన్యం తనకున్న సంబంధాలతో కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్ళడంతో వారి ద్వారా తీవ్ర మందలింపులకు గురయ్యారనే ప్రచారం జరుగుతోంది.
- స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలకు, దాడులకు, కిడ్నాప్‌లకు పాల్పడిన ఉదంతాలున్నాయి.
- పాల సరఫరా సహకార సంఘం ఎన్నికల్లో నామినేషన్ వేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు కారుపై వైసీపీ కార్యకర్తలు పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ కూడలిలో రాళ్ళతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

జంగమయ్య సన్నిధిలో అవినీతి తాండవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతి తాండవించింది. అంది వచ్చిన ప్రతీ అవకాశంలో స్వలాభం చూసుకున్నారు. పారిశుధ్యం కోసం ఉపయోగించే చీపురు పుల్లల దగ్గర నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ వరకూ అన్ని స్థాయిల్లోనూ అందిన కాడికి దోచేశారు.

- అయిన వారికే కాంట్రాక్టులు కట్టబెట్టడం. వాటి నుంచి కమీషన్లు గుంజేయడం చేశారు. సెల్ ఫోన్, లగేజీ, కార్ పార్కింగ్, టెండర్లలో భక్తుల నుంచి అధిక ధరలతో దోపిడీ చేశారు.
- గోశాలలో గడ్డి కొనుగోళ్ల వ్యవహారంలో గోల్‌మాల్ చేశారు.
- ఆలయ నిధులతో ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదనలు అడ్డం పెట్టుకొని అవసరం లేని నిర్మాణ పనులన్నీ చేపట్టారు. కమీషన్ల కక్కుర్తితో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేశారు. ఆలయంలో ఆదాయ స్థావరాల్లో విధులు కేటాయించేందుకు ఎవరైనా ముడుపులు చెల్లించాల్సిందే.
- పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కన్నా అధిక సంఖ్యలో పేర్లు నమోదు చేసి లక్షలాది రూపాయలు దోపిడీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ముక్కంటి ఆలయం రాహు కేతు పూజల సమయంలో దోషం పోవాలంటే దక్షిణ చెల్లించాలంటూ భక్తుల నుంచి బలవంతంగా వసూలు చేశారు. నెలకు రూ.1కోటి చొప్పున పోగవుతుందని అంచనా. అక్రమ సొమ్మును రాహు కేతు పూజల వద్ద పనిచేసే సిబ్బంది మొదలు నాయకుల దాకా వాటాలు వెళ్తాయని ప్రచారం ఉంది.
- వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే తన అనుచరులను ఉచిత సేవకుల పేరుతో పీఆర్‌ఓ కార్యాలయంలో అనధికారికంగా 100 మందిని నియమించారు. వీరు వైట్ కాలర్ దళారీలు దర్జాగా దర్శనాలు చేయిస్తుంటారు. ఎమ్మెల్యే అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా అడ్డదారిలో దర్శనాలు చేస్తుంటారు. ఒక్కో దళారి రోజు సంపాదన రూ.10 వేలకి తగ్గదని చెబుతారు.
- మహాశివరాత్రి ఉత్సవాలలో కాంట్రాక్టులను అయిన వారికే కట్టబెడుతూ భారీగా సొమ్ము మింగేశారు. ఉదాహరణకు ఈ ఏడాది ఎంత ఖర్చు అయ్యిందీ వెల్లడించలేదు.

ఆఫీసుల్లో నిఘా

- నియోజకవర్గంలోని రెవెన్యూ కార్యాలయాల్లో చీమ చిటుక్కుమన్నా తనకు తెలిసేలా వంద శాతం సిబ్బందిని తనకు కావాల్సిన వారినే నియమించుకున్నారని, వారిలో పరస్పరం ఒకరిపై ఒకరు నిఘా వుండేలా ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. తద్వారా తహసీల్దారు కార్యాలయాల్లో ఏ ఫైలు కదిలినా తన దృష్టికి వచ్చేలా జాగ్రత్త పడ్డారనే ప్రచారముంది. ప్రతి ఫైలూ తనకు తెలిసే, తనకు వాటా వుండేలా ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలున్నాయి.
- భూముల కబ్జా విషయాల్లో సహకరించిన రెవెన్యూ అధికారులపై అత్యున్నత స్థాయి నుంచీ చర్యలకు ఆదేశాలు వచ్చినా వారిని కాపాడారని, కనీసం బదిలీలు కూడా కాకుండా అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి.

రాజుగారి గుండెలు జారిన కత

త్తిరుగే లేని చక్రవర్తిగా ఐదేళ్లు వైభోగం అనుభవించిన ఆయనకి చిన్న డౌటనుమానం వచ్చింది. తన ముందు చేతులు కట్టుకుని ఎంతో వినయ విధేయతలు ప్రదర్శిస్తూ, తాను నోరు తెరిస్తే వహ్వా.. వహ్వా అంటూ పొగడ్తలతో ముంచెత్తే సామంతరాజుల నిజ స్వరూపం తెలుసుకోవాలని అనిపించింది. రాజు తలచుకుంటే కొదవేముంది? అసలే వేషాలు వేయడంలో మాంచి అనుభవం ఉండడంతో, చీకటి పడ్డాక మారు వేషంలో నగరమంతా తెగ తిరిగేశాడు. టీయంగళ్ల దెగ్గిర, బస్టాండుల్లో జనం మాటలు విన్నాక కోపం నషాళానికి అంటింది. ఒరలోని కత్తిని కసిగా బయటకీ లోపలకీ రెండుమూడు సార్లు తీసి తోసి, మారు వేషంలో ఉన్నామని గుర్తుకొచ్చి.. ఇంక తిరిగేది చాలించేసి కోటకి తిరిగి వచ్చేశాడు. ఉన్నపళంగా అత్యవసర సమావేశానికి రావలసిందిగా సామంతులకు ఆదేశాలు జారీ చేశాడు. ఏమి ఉపద్రవమో అని భయపడతా కొందరూ, మానవత్వం.. మంచితనం అంటూ మళ్లీ అవే నీతి మాటలు ఎన్నిసార్లు వినాల్నో ఏమో అని వణుకుతూ మరికొందరూ అర్ధరాత్రి మీటింగుకు హాజరయ్యారు.

ముళ్ల పొద మీద కూర్చున్నట్టుగా సింహాసనంపై ఉన్న రాజుగారిని చూడగానే మేటర్..సీరియస్సే అని అర్థమైపోయింది అందరికీ. ఎర్రజీరలతో ఉబ్బిన కళ్లతో అందరినీ ఒకసారి కలియజూసి గొంతు సవరించుకుని మొదలు పెట్టాడు..

"ఎవుర్ని నమ్మాలో..ఎవుర్ని అనుమానించాలో అర్థమే కావడం లేదు." అని గ్యాప్ ఇచ్చాడు. ఎప్పుడూ గంభీరంగా వినిపించే ఆయన కంఠంలోని వణుకుని చూసి సామంతులంతా విచిత్రపోయారు.

"పైసాకి పనికిరానోళ్లందరినీ సామంతరాజులను చేశాను కదా! నాముందు చిత్తం దొరా..అంటూనే, నా వెనకాల గూటాలు దించే పని మొదులు పెట్టారు. శత్రుదుర్భేద్యం అనుకున్న నా కోటకు బీటలేంది? ఏదో మాటవరసకు నేనెంతో సొమ్ముడిని అని పదే పదే చెప్పాను గదా అని ఎక్కి తొక్కేద్దాం అనుకుంటా ఉండారేమో.. తాట తీస్తా.. ఒక్కొక్కరికీ. ఎగస్పార్టీవాళ్లతో చేతులు కలిపినోళ్లని మేమే ఎండబెట్టిన పేరూరు చెరువులో వేసి తొక్కతా.. అసలే నాది జైలు బ్యాక్‌గ్రౌండ్ అని మరిచిపోబాకండి" అని దీనంగా హెచ్చరించగానే పరిస్థితి కట్టుదప్పుతా ఉందని గ్రహించిన వాడై యువ రాజు గొంతు విప్పాడు.

"సిద్ధం అని మనం ప్రకటించిన యుద్ధంలో విజయం మనదే.. అయినా తండ్రిగారు ఎందుకో సందేహపడుతున్నారు కాబట్టి మీరంతా మీ విధేయతను ప్రకటించుకోవాలి" అని కత్తులు కరకరలాడే మెత్తని స్వరంతో ఆదేశించాడు. సామంతులు సణుక్కున్నా.. ఒక్కొక్కరుగా నడి సమావేశ మందిరంలోకి వచ్చి వినయ విధేయ వీర భక్త ప్రదర్శనలతో రక్తి కట్టించారు. ఒకరు పులేషం వేసి రంజింపజేయగా, మరొకరు సర్రున చాకు దూసి తన చేతిపై గాటు పెట్టుకుని బొటబొటగారే నెత్తురు వేలికద్దుకుని యువరాజు నుదుటిన బొట్టు దిద్దారు. ఇంకొకరు ఆవేశంగా చొక్కా చింపేసుకుని గుండెలు చూపిస్తూ 'దీన్ని కోసి చూడండి.. మీరే కనిపిస్తారు' అని ఉన్మాదంగా అరిచారు.

ఈ ప్రదర్శనలన్నీ చూశాక రాజుగారూ, యువరాజుగారూ నిమ్మళించారు. అనవసరంగా అనుమానించానే అని చింతపడ్డారు. 'ఇంక పొండి ఇళ్లకి' అని అందరినీ పంపేసి తెల్లారే దాకా హాయిగా ఏసీలేసుకుని నిద్రపోయారు.

మరుసటి రోజు: నిద్రలేవగానే తెలిసిన సమాచారం విని పెద్దరాజుకీ, బుల్లిరాజుకీ చెంబుడు వేడి వేడి నీళ్లు తాగినా ఉదయపు పని సాఫీగా సాగలేదు. రాత్రి వీరంగాలు వేసినవాళ్లలో ఇద్దరు జంప్. ఇంకొకరు రాత్రికి ముహూర్తం పెట్టుకున్నారు. ఇంకొందరు క్యూలో నిలబడ్డారు అని విని.. 'హతవిధీ.. ఏమిటీ విపరీతం..' అని యువరాజు వైపు పెద్ద రాజు బేలగా చూశాడు. తండ్రిని ఆ స్థితిలో తొలిసారి చూసిన యువరాజుకు అన్నీ జారిపోయాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి






ఛాలెంజ్ ఓటు అంటే....?

ఓటర్ల జాబితాలో పేరున్నా.. ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి డిపాజిట్‌గా రూ.5 అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- తిరుపతి కలెక్టరేట్




టెండర్ ఓటు అంటే ?

ఒక్కోసారి ఓటు వేయడానికి వచ్చేసరికి మీ ఓటు వేసేశారు అని ఎన్నికల సిబ్బంది చెబుతారు. అంటే ఆ ఓటు ఇంకెవరో వేసి వెళ్ళిపోయారన్నమాట. ఇటువంటి సమయంలో ఓటరు తన హక్కును వినియోగించుకోవడానికి తన ఓటు తనే వేస్తానని పట్టుబట్టవచ్చు. ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయచ్చు. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. ఈ ప్రక్రియనే టెండర్డ్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌లో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బ్యాలెట్ యూనిట్ పైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఈ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్ళి ఓటు వేసి ఆ పత్రాలు కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆ బ్యాలెట్ పత్రం వెనుక ఇంక్(సిరా)తో టెండర్డ్ బ్యాలెట్ అని రాస్తారు. దీనిని లెక్కింపులో పరిగణనకు తీసుకుంటారు.

- తిరుపతి కలెక్టరేట్

యో... చూసుకోబళ్లా



ఇటీవలే ఆ నాయకుడు టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకున్నాడు. కొత్త పార్టీలో చేరిన ఉత్సాహంతో ప్రచారంలో గొంతు చించుకునేలా నినాదాలూ చేస్తున్నాడు. 'అమ్మా.. అయ్యా.. మన గుర్తు మీకు తెలుసు కదా.. సైకిల్. సైకిల్ గుర్తుకే మీ ఓటు' అని తరచూ అభ్యర్థిస్తుండడంతో పక్కనున్నవాళ్లు అవాక్కవుతున్నారు. ఆ తర్వాత సర్దుకుని ఫ్యాను గుర్తుకే అని చెబుతున్నాడు. తిరుపతి నగరంలో వీధి వీధినా ఇటువంటి టంగ్‌స్లిప్ సంఘటనలూ రోజూ జరుగుతూనే ఉన్నాయి. పోలింగ్ దగ్గరపడేసరికి అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ నాయకులు పార్టీలు మారేస్తున్నారు. కొత్త కండువాలతో జనం ముందుకు వెళ్లినా పాత వాసనలు వదలడం లేదు. పార్టీల పేర్లూ, గుర్తులూ తప్పు చేప్పేసి నాలుక కొరుక్కుంటున్నారు. 'ఎందియా...యో..నువ్వు, చూసుకోబళ్లా' అని పక్కనున్నవాళ్లు విసుక్కుంటే.. 'మహా మహా మంత్రులే మాట తడబడి సీఎం చంద్రబాబు అని అసెంబ్లీలో ఎన్నిసార్లు అనేసినారు.. యా.. నాదేముండాది' అని సర్దుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆల్ ఇన్ ఆల్.. నేదురుమల్లి

నాలుగు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన అరుదైన ఘనత జిల్లాలోని వాకాడుకు చెందిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. శాసనమండలి, శాసనసభలకు ఒక్కోసారి, రాజ్యసభ, లోక్‌సభలకు మూడేసిసార్లు చొప్పున ఎన్నికయ్యారు. 1972, 2009, 2010లలో రాజ్యసభకు నేదురుమల్లి ప్రాతినిధ్యం వహించారు. ఇక లోక్‌సభకు 1998లో బాపట్ల నుంచి, 1999లో నర్సరావుపేట నుంచి, 2004లో విశాఖపట్టణం నుంచి ఎన్నికయ్యారు. 1978లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన నేదురుమల్లి 1978-1983 మధ్య మర్రి చెన్నారెడ్డి కేబినేట్‌లో మంత్రిగానూ చేశారు. 1989లో వెంకటగిరి నుంచి శాసనసభకు ఎన్నికై 1989-90 మధ్య కాలంలో మంత్రిగా చేశారు. 1990లో ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి పలు ఆరోపణలతో గద్దెదిగారు. ఆరు సార్లు ఎంపీ అయినా ఒక్కసారి కూడా కేంద్ర కేబినేట్‌లో నేదురుమల్లికి మంత్రిగా అవకాశం దక్కలేదు.

-గూడూరు





'ఏందప్పా.. మేం ముస్టోల్లలా కనబడ్తా వుండామా మీ పాపిస్టి కళ్లకు.. ఎల్లండెల్లప్పా' అని కసిరి తరిమేస్తా వుండారంట జనాలు. 'పది ఎయ్యిలకు తక్కవిస్తే ఊరుకునేది లేదప్పా. మేం తగ్గేదే ల్యా' అని అడ్డం తిరిగి కూర్చుంటా వుండారంట. ఇంతకీ సంగతేంది అంటారా. కుప్పంలో అతికార పార్టీ వోల్లు మూటలు ఇప్పేశారని బుదారం పద్దన్నే గుప్పుమని పొయ్యింది. సోమారం రేత్తినింకానే ఓటుకు నాలుగు ఎయ్యిలు పంచడం స్టార్ట్ అయిపొయ్యిందంటా జనాలు చెవులు కొరుక్కునేసినారు. ఇది నిజ్జమేనని నమ్మబలకేవోల్లు ఎక్కవైపొయ్యినారు. నిజిమేందో, అబద్ధమేందో ఆ గంగమ్మకు ఎరకకానీ, కుప్పం ప్రజలు మాత్తరం కొండెక్కి కూకునేసినారు. మరీ పల్లెటూల్ల జనాలు అగ్గిమీద గుగ్గిలం అవతా వుండారు. 'కుప్పం టౌనోల్లు అంత తీపి, మేమంటే మేంటే అంత చేదెందుకు మీకు?' అని అతికార పార్టీవోల్లని నిలదీస్తా వుండారంట. కుప్పం నియోజకొర్గంలోని పల్లెటూల్ల ప్రెజల ఆగ్రహానికి కూడా మంచి కారణమే ఉండాది. మొన్న కుప్పం మున్సిపల్ ఎలచ్చన్లలో అతికార పార్టీవోల్లు టౌనోల్లకు ఓటుకు తలా అయిదు ఎయ్యిలు కాసులు పంచేసిండ్లా. అదింకా మర్సిపోలా జనాలు. ఎమ్మెల్లే ఎలచ్చన్లకు కనాకస్టం పది ఎయ్యిలు ఇస్తారని గెట్టిగా డిసైడ్ పొయ్యివుండారు గదా అప్పటినింకా. ఇప్పుడు పది ఎయ్యిలు కాదు కదా, టౌనోల్లకంటే మున్సిపాలిటీ ఎలచ్చన్లలో టౌనోల్లకిచ్చిన కాసుల్లో ఎయ్యి తగ్గించేసి నాలుగు ఎయ్యిలే ఇస్తామంటే ఒల్లు మండదా ఎవుర్కైనా. మల్లీ ఇంకోమాట కూడా ఇనిపిస్తావుండాదప్పా. ఏం లేదు.. ఈ నాలుగు ఎయ్యిలు కూడా ఇస్తావుండేది కుప్పం టౌనోల్లకేనంట. పల్లెటూళ్లల్ల ఓటుకు మూడు ఎయ్యిలే ఇస్తావుండారని ప్రెచారం జరగతా వుండాది. ఈ ప్రెచారంతో అగ్గిమీద గుగ్గిలం అయిపోతా వుండారంట పల్లె జనాలు. పంపకాలకు వొచ్చినోల్లపైన తిరగబడతా వుండారంట. 'పది ఎయ్యిలకు తగ్గేదే ల్యా' అనేసి అల్లు అర్జున్ మాదిర్తో గెడ్డం కింద చెయ్యిపెట్టి తలెగరేస్తావుండారంట. అదప్పా.. సంగతి.

\- కుప్పం

ఈ మధ్యనే మాట్లాడాడే.. ఏమైంది?



గ్రామాల్లో ఎవరైనా మరణించారన్న విషయం తెలిస్తే చాలు.. వివిధ పార్టీలకు చెందిన నేతలు పూలమాలలతో వచ్చేస్తున్నారు. నివాళులర్పిస్తున్నారు. 'అన్నా ఏమైంది నాన్నగారికి. ఈ మధ్యనే చూసి మాట్లాడించాను. అంతలోనే ఏం జరిగింది? అయ్యో మంచి వ్యక్తన్నా. పదిమందికి సాయపడాలనుకునేవాడు. మేముండంగానియన్నా మేంచూస్కుంటాం. ఏంభయపడదొద్దు మనపార్టీలోని ఫలానా నేతకు చెప్పి మావంతు తోడ్పాటు అందిస్తాం' అంటూ మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో మరణించిన వ్యక్తి ఏ పార్టీకి సానుభూతిపరుడో అన్నది కూడా చూడటం లేదు. పరిచయంతో పనిలేదు. ఇదంతా ఎందుకంటే.. మృతుడి కుటుంబసభ్యులతో పాటు వారి బంధువులు, మిత్రులు, తెలిసినవారు దాదాపుగా వందమంది ఒక దగ్గర చేరే అవకాశం ఉంటుంది. తాము వెళ్లడం వల్ల వారిలో తమపార్టీకి సానుకూలత ఏర్పడి ఓట్లుగా మారతాయన్నది వీరి ఆశాభావం. కొన్నిచోట్ల అంత్యక్రియల ఖర్చుకంటూ కొంత మొత్తం కూడా ఇస్తున్నారు.


\- గంగాధరనెల్లూరు

జన కేతనం

కొండలకు గుండు చేసిన స్వామి

● నోరు పారేసుకోవడం తప్ప జీడీనెల్లూరుకు చేసిందేమిటి?

కథనం - వెదురుకుప్పం



మీ కుమార్తెకు ఓటెందుకెయ్యాలి?

'ఎక్సైజ్ మంత్రిగా మీరు మద్యనిషేధం అమలు చేయనందుకా? మీ నియోజకవర్గంలో బెల్టు షాపులను నియంత్రించలేకపోయినందుకా? సారా తయారీ, విక్రయాల కట్టడిలో విఫలమైనందుకా? హామీలను నెరవేర్చనందుకా? అభివృద్ధిని పట్టించుకోనందుకా? కొందరు అవినీతి అధికారులకు.. కొండలు చదునుచేసి కబ్జా చేసిన అనుచరులకు అండగా నిలబడినందుకా? మీరేం చేశారని.. మీ వారసురాలికి ఓటేయాలి' అంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

'పేదలపాలిట మహమ్మారిలా మారిన మద్యాన్ని సంపూర్ణంగా నిషేధించిన తర్వాతే 2024లో ఓట్లు అడుగుతా'

● అనేక సభల్లో జగన్‌రెడ్డి దబాయించి ఇచ్చిన ఈ హామీని ఆయనా అమలు చేయలేదు. ఆయన మంత్రివర్గంలో ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన నారాయణస్వామీ నిషేధం గురించి ఎన్నడూ నోరు తెరవలేదు. తమకు బైబిల్, ఖురాన్, భగవద్గీత అనిచెప్పే మేనిఫెస్టోలో ధాటీగా ప్రకటించిన మద్యనిషేధాన్ని కనీసం కూడా అమలు చేయకుండానే వీరు నిస్సిగ్గుగా ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారు. మద్యం ధరలు పెంచి, చవకరకం మద్యం షాపుల్లో పెట్టి, ప్రభుత్వమే మద్యం అమ్మి ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం పెంచుకునే ప్రణాళికలు వేసి అమలు చేసిన వీరు తమ ముందుకొచ్చి ఓట్లు అడుగుతున్న తీరు చూసి జనం ఔరా అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుంచి నారాయణస్వామి పోటీలో లేరు గానీ ఆయన కుమార్తె కృపాలక్ష్మిని బరిలో దించి ఆయనే మొత్తం బాధ్యత భుజాన వేసుకున్నారు. పల్లె పల్లె ఇల్లిల్లూ తిరుగుతున్నారు. నిత్యం జగన్ భజన చేస్తూ, సందు దొరికితే వయసు కూడా మరిచి ఆయన కాళ్లకు నమస్కరిస్తూ, జగన్‌కి తన చర్మంతో చెప్పులు కుట్టిస్తానని చెప్పి దళితుల ఆత్మ గౌరవాన్ని పదవి కోసం తాకట్టు పెకట్టేసిన నాయకుడిగా విమర్శలకు గురవుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి.. తాను చేసిన అభివృద్ధిని చూసి తన కుమార్తెకు ఓట్లేయమని అడుగుతున్నారు. ఇంతకీ డిప్యూటీ సీఎం పదవిలో ఉండి ఆయన జీడీ నెల్లూరు నియోజకవర్గంలో చేసిందేమిటి? సాధించిన అభివృద్ధి ఏమిటి? అనే చర్చ జరుగుతోంది.

డిప్యూటీ సీఎం అయ్యాక మారిన మాట

డిప్యూటీ సీఎం అయ్యాక నారాయణస్వామి మాట మారింది. ఏ చిన్న సమావేశమైనా, ప్రెస్ మీట్ అయినా తొలుత టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్, ప్రముఖ మీడియా సంస్థల యజమానులను దూషించడం పరిపాటిగా మారింది. అభివృద్ధి.. తన మంత్రిత్వ శాఖకన్నా ప్రతిపక్ష నాయకుల మీద దుమ్మెత్తి పోయడానికే ప్రాధాన్యమిచ్చారు. సొంత పార్టీలోనూ 'పెద్ద' రెడ్లకు భజన చేయడం.. సీఎం కాళ్లపైన పడే ఈయన.. స్థానిక రెడ్లపై నోటి దురుసు చూపుతారనే విమర్శలున్నాయి. దీనిపై స్వపక్షాల్లోనూ ఆక్షేపణలు వచ్చినా.. ఆయన తీరు మారలేదు. ఆయన వ్యవహార శైలితో సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. పెనుమూరుకు చెందిన ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, అతడి వర్గీయులు అసమ్మతిగా మారారు. ఈయనకు టిక్కెట్ రాకుండా ప్రయత్నించారు. అటు ఇటు పోయి చివరికి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మికి అధిష్ఠానం టికెట్ ఇచ్చింది.

● అక్రమ కేసులతో అణగదొక్కాలని...

తన ఇంటికి రోడ్డు వేయలేదని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రశ్నించిన కార్వేటి నగరం మండలంలోని ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయించి, కేసు నమోదు చేయించారు. వైసీపీలోని వ్యతిరేక వర్గీయులపైనా కేసులు పెట్టించారు. పలు మండలాల్లో మీడియా ప్రతినిధులపైనా అక్రమ కేసులను బనాయించడంలో కీలకపాత్ర పోషించారు. తన మాట వినని తహసీల్దార్లు, ఎస్‌ఐలను తరచూ బదిలీలు చేయించేవారు. అనుకూలంగా ఉన్న వారు ఏం చేసినా వెనకేసుకొచ్చేవారు.

● జనం చెవిలో 'స్వామి' పూలు



హామీ: జీడీనెల్లూరు, పెనుమూరు, కార్వేటినగరంలోని పీహెచ్‌సీల స్థాయిని పెంచి 50 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చేస్తా.

అమలు తీరు: పెనుమూరు, కార్వేటినగరం ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. కార్వేటినగరంలో నిర్మాణ దశలో ఉండగా, పెనుమూరులో పునాది దశలో ఉంది. జీడీనెల్లూరుకు మంజూరు కాలేదు.





హామీ: పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం నుంచి నియోజకవర్గంలోని 32 చెరువులకు నీటిని అనుసంధానిస్తా. పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో సుమారు 60 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తా.

అమలు తీరు: ఐదేళ్లు పూర్తయి మళ్లీ ఎన్నికలొస్తున్నా చెరువుల అనుసంధానమనే ఊసే లేదు.

హామీ: పెనుమూరులో పాలిటెక్నిక్ మంజూరు చేయిస్తా.

అమలు తీరు: ఇంతవరకు అతీగతి లేదు.

హామీ: జీడీనెల్లూరు మండలం కలిజవేడు, కొత్తకోన పంచాయతీ మధ్యలో నీవానదిపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతా.

అమలు తీరు: అధికారులు పరిశీలించారే కానీ పనులు మొదలు కాలేదు. వరదలొస్తే ఆ గ్రామాల ప్రజలు నది దాటేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

హామీ: జీడీనెల్లూరు మండలం మోతరంగనపల్లెలో ఫ్యాక్టరీలను తెచ్చి శ్రీసిటీ తరహాలో అభివద్ధి చేస్తా.

అమలు తీరు: చిత్తూరు- పుత్తూరు రహదారి పక్కనున్న ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీల కోసం గతంలోనే స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తానన్న ఒక్క లెదర్ ఫ్యాక్టరీని కూడా ఏర్పాటు చేయలేకపోయారు.



హామీ: పచ్చికాపల్లం నుంచి కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరిస్తా.

అమలు తీరు: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి దేవళంపేట మీదుగా ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు చేయలేదు. కాకపోతే మరమ్మతులు జరిగాయి.

హామీ: కార్వేటినగరం మండలం కృష్ణాపురం, ఎర్రమరాజుపల్లె సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేయిస్తా.

అమలు తీరు: ఇప్పటికీ మంజూరు కాలేదు.

ప్రాజెక్టుల కథ కంచికే...!

హామీ: పాలసముద్రం మండలం నరసింహాపురం సమీపంలో మామిడిమాను మడుగు వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తా.

అమలు తీరు: ఈ ప్రాంతంలో పడిన వర్షపు నీరు తమిళనాడుకు తరలిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మించి తిరుమలరాజుపురం, కోదండరామాపురం, గంగమాంబాపురం, నరసింహాపురం రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నా హామీ నేటికీ నెరవేరలేదు.

హామీ: కార్వేటినగరం మండలం దాసరినత్తం వద్ద మినీ రిజర్వాయర్ మంజూరు చేయిస్తా.

అమలు తీరు: ఈ హామీ కూడా కలగానే మిగిలింది.

హామీ: వెదురుకుప్పం మండలం బొప్పలమడుగు సమీపంలో మినీ ప్రాజెక్టు మంజూరు చేయిస్తాను.

అమలు తీరు: ఈ రోజుకూ కార్యరూపం దాల్చలేదు.

క్రీడాకారుల ఆశలు ఆవిరి



హామీ: వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారులకు మినీ స్టేడియం ఏర్పాటు చేయిస్తా.

అమలు తీరు: మండలంలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు చాలా మంది ఉన్నప్పటికీ మినీస్టేడియం కార్యరూపం దాల్చలేదు.

కొండలు చదును చేసేశారు

తనలో ఎంత వెతికినా అవినీతి మచ్చ కనబడదంటారు. విపక్షాలకు సవాళ్లు విసురుతారు. లంచం అడిగారో ఖబడ్దార్ అంటూ అధికారులను హెచ్చరిస్తారు. కానీ, ఆయన అనుచరులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేశారు. ఇక, కొండల్ని చదును చేసి మొక్కలు నాటి సొంతం చేసుకున్నారు. దీనికి డిప్యూటీ సీఎం మద్దతు ఉందన్న ఆరోపణలున్నాయి.

● వెదురుకుప్పం మండలం జక్కిదొన ప్రాంతంలో పాండురాజు గుట్ట సుమారు 16.23 ఎకరాల్లో ఆక్రమణలు జరిగాయి. ఆ ప్రాంతంలోనే సర్వే నంబరు 828లో 7.22 ఎకరాల గుట్ట కూడా ఆక్రమణలకు గురైంది. ఎలువల గుట్టనూ ఆక్రమించారు. కొమరగుంట సర్వేనంబరు 269 తదితర చోట్ల గుట్టను చదును చేశారు.



కొమరగుంట వద్ద కొండను తవ్వేశారిలా..

● గంగాధరనెల్లూరు మండలం కొండేపల్లె సమీపంలోని గుట్టలు కరిగిపోతున్నాయి. పోలినాయుడుపల్లె నుంచి చింతారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో పక్కనున్న గుట్ట కరిగింది. చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారిలోని పద్మాపురం బస్టాప్ దగ్గర ఆక్రమణలు జరిగాయి.

● కార్వేటినగరం మండలం భువనేశ్వరి గుట్టను చదును చేసి ఆక్రమించుకున్నారు. మొక్కలు నాటేశారు. విజయమాంబాపురం దగ్గర గుట్టను చదును చేస్తున్నారు. ఇలా బహిరంగంగానే కొండలను గుండు కొడుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదు.

భువనేశ్వరి యుద్ధ భేరి!

● కదం తొక్కిన కుప్పం నారి ● గ్రామగ్రామాన నీరా'జనం'



ప్రజలతో మమేకమైన భువనేశ్వరి

కుప్పం, మే 8: 'ఓటు మన ఆయుధం, ఈనెల 13న జరిగేది యుద్ధం. గురిచూసి ఆయుధం వదలాలి. ఫ్యాను రెక్కలు ఊడి కింద పడాలి' అంటూ తన భర్త చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పం గడ్డమీద నిలబడి నారా భువనేశ్వరి మోగించిన యుద్ధభేరి ఇది. ఆమె భేరీ నినాదానికి, ఉద్రేకమైన కుప్పం నారి అడుగడుగునా కదం తొక్కింది. ఐదేళ్ల తమ కష్టాలు తలచుకుని, రాబోయే 'చంద్ర' రాజ్యాన్ని మనసున నిలుపుకుని గ్రామగ్రామానా ఆమెపై ప్రజల అభిమానం పోటెత్తింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి శాంతిపురం మండలం బెల్లకోగిలలో మొదలైన ఆమె రోడ్ షోలు, రెండో రోజైన బుధవారం రామకుప్పం మండలం మీదుగా కుప్పం మండలం కంగుంది, దాసేగౌనూరు మీదుగా కొనసాగి తంబిగానిపల్లెలో ముగిసింది. ముందుగా నిర్ణయించిన రూట్ మ్యాప్ మార్గంలోనే కాదు, అడుగడుగునా వెల్లువెత్తిన అభిమానం చూసిన భువనేశ్వరి అదనపు గ్రామాలనూ సందర్శించారు. ఇలా రామకుప్పం మండలంలో షెడ్యూల్‌లో లేని సుమారు పది గ్రామాలను చుట్టేశారు. ఎక్కడా తడబడకుండా వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టారు. ముఖ్యంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి ప్రభుత్వ మోసపూరిత కుట్రను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను ప్రశ్నించారు. క్రమేణా భువనేశ్వరిలో వచ్చిన ఈ మార్పు పార్టీ శ్రేణులను ఉత్తేజితులను చేసింది. రాష్ట్రమంతా పర్యటించే క్రమంలో చంద్రబాబు ప్రచారానికి తరచూ రాలేకపోతున్న లోటు తీరినట్లుగా వారు ఇప్పుడు భావిస్తున్నారు.

అలుపెరగని పలకరింపు

గతంలో భువనేశ్వరి కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు ఒకట్రెండు కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అదీ మండల కేంద్రాలు, ఈ సమీప గ్రామాల్లో మాత్రమే. పొద్దు వాలకుండా ఆయా కార్యక్రమాలు ముగించేసి బస చేరేవారు. ఈసారి ఆమె మారుమూల గ్రామాలు సైతం పర్యటించారు. మంగళవారం రాత్రి 8.30 గంటలకు రోడ్డుషో ప్రారంభమై, 10 గంటలకు ముగిసింది. మంగళవారంనాడు ఉదయం పదిన్నర గంటలకు కుప్పం నుంచి బయలుదేరిన ఆమె రామకుప్పం మండలంలోని మూలమూలనున్న గ్రామాలను సైతం చుట్టేశారు. ఆ మండల కేంద్రం నుంచి 30కిలోమీటర్లకుపైగా దూరాన ఉన్న వీర్నమలతాండాలో మహిళలతో సమావేశమయ్యారు. రెండో రోజూ ఆమె పర్యటన ముగిసే సరికి రాత్రి పది గంటలైంది. ఎక్కడా అలుపెరగకుండా ప్రసంగాలు చేశారు. చిరునవ్వుతో ప్రజలను, కార్యకర్తలను, అభిమానులను పలకరించారు. రెండు రోజుల భువనేశ్వరి పర్యటన టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపింది.

తమ్ముడు తోడుగా: ఈసారి ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ ఎన్నికల ప్రచారానికి అక్క భువనేశ్వరితో కలిసి వచ్చారు. రోడ్ షోల పొడవునా ఆమె వెంటే ఉన్నారు. అక్కడక్కడా మాట్లాడారు. ఆయన్ను చూడడానికి జనం పోటీపడ్డారు.



వి.కోటలో మూతపడిన పాలశీతలీకరణ కేంద్రం

● ఎట్టెట్టా

నేను..గానీ.. ఈల గానీ వేస్తే..



నేను గానీ.. ఈల గానీ వేస్తే.. అని వీధుల్లో గారడీ చేసేవారు అంటూ ఉంటారు. సరిగ్గా జగన్ రెడ్డి పాదయాత్రలోనూ, 2019 ఎన్నికల ప్రచారంలోనూ ఊరూరికీ వెళ్లి ఇట్లాగే మాటలు చెప్పారు. వి.కోటలో మూతబడి, తుప్పుబట్టిన సహకార పాల శీతల కేంద్రాన్ని చూసి కన్నీరు పెట్టి, 'నేను అధికారంలోకి రాగానే తిరిగి తెరిపించి నడిపిస్తా..' అని చెప్పారు. కుర్రాడు కదా.. చెప్పింది చేస్తాడేమో అని జనం కూడా నమ్మారు. ఓట్లు గుద్దారు. అంతే ఆ తర్వాత ఆయన జనం నెత్తిన బాదుడే..బాదుడు కార్యక్రమం అమలు చేశాడు. వి.కోట పాల డెయిరీ కత కలికానికి కూడా రాలేదు. తుప్పుబట్టిన యంత్రాలు.. తుప్పలు మొలిచిన ప్రాంగణం.. ఇదిగో ఇలా ఈసురోమంటూ ఉంది 1980లో ప్రారంభించిన పాలడెయిరీ.

\- వి.కోట

ఇది.. జగనన్న రోడ్డు

బస్సు దిగుతున్నది చెరువులో అనుకుంటున్నారా.. కాదు కాదు సాక్షాత్తు రోడ్డులోనే. చిత్తూరు-పరదరామి మార్గంలోని ఇరువారం చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై చెరువును తలపిస్తున్న గుంత ఉంది. ప్రతిసారీ వర్షం వచ్చినప్పుడల్లా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు గానీ, అధికారులు గానీ తమకు సంబంధం లేదన్నట్లుగా ఉన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గుంతలో నీరు చేరింది. దీంతో ఇక్కడ గుంత ఉందన్న విషయం తెలియక చాలామంది అందులో పడి గాయాలపాలయ్యారు.



\- యాదమరి

● ఇదీ సంగతి

జెండా ఎత్తితే రూ.500

పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాలను ముమ్మరం చేశారు. తమ గుర్తుకే, తమ పార్టీకే ఓట్లు వేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ.. ప్రచార రథాలతో కలసి ప్రచారాలు సాగిస్తున్నారు. పుంగనూరులో ఇటీవల అన్ని రాజకీయపార్టీల్లోనూ నాయకులు, పార్టీ ముఖ్యకార్యకర్తలు మినహా మిగిలిన వారంతా అద్దెజనమే. ఆయా పార్టీల తరపున జెండా చేతపట్టుకుని వారి టోపీ ధరించి మెడలో కండువాతో నాయకుల వెంట తిరిగితే ఒక్కొక్కరికి సాయంత్రానికి రూ.500 ఇస్తున్నారు. ఉదయం టిఫన్, మధ్యాహ్నం బిర్యానీ అందిస్తున్నారు. కానీ కొంతమంది అన్ని పార్టీల ప్రచారాల్లోనూ రోజుకో జెండాతో దర్శనమిస్తున్నారు. అన్ని పార్టీలకు వీరి అవసరం ఉండటంతో డిమాండు పెరిగింది.

\- పుంగనూరు

ప్రచారానికి అభిమానంతో వచ్చేవాళ్లు

● మా రోజుల్లో...



'అప్పట్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే నాయకుడిపై అభిమానం ఉంటే చాలు. ప్రచారంలో అతడి వెంట జనం నడిచి వచ్చేవాళ్లు. అతడి గెలుపునకు కృషి చేసేవాళ్లు. ఇప్పుడు పైసలిస్తేనే ప్రచారానికి వస్తున్నారు' అని పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన టర్లిన్‌బాషా (87) నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాటితరం ప్రజా ప్రతినిధులు నిరాడంబరమైన జీవితాన్ని గడిపేవారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంపకాలు ఉండేవి కావు. ఎన్నికల ఖర్చు వేళ్లమీద లెక్క పెట్టేలా ఉండేది. అప్పట్లో ఎంతోమంది ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు. ఇప్పటి ఎమ్మెల్యేలు ఖరీదైన కారుల్లో ప్రయాణం చేస్తున్నారు. మా తరం రాజకీయాతో పోల్చి చూస్తే ఇప్పుడు ఎంతో తేడా కనిపిస్తోంది' అని పేర్కొన్నారు.

\- కల్లూరు

కారును ఢీకొన్న మినీలారీ

ఏర్పేడు, మే 8: కారును మినీలారీ ఢీకొన్న ఘటన ఏర్పేడు మండల కేంద్రంలోని కోబాక రోడ్డు క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. రంగారెడ్డి జిల్లాకు చెందిన వినోద్ కుటుంబసభ్యులు తిరుమల వెంకన్న దర్శనార్థం కారులో వెళ్తుండగా శ్రీకాళహస్తి నుంచి రేణిగుంట వైపు వెళుతున్న మినీలారీ కోబాక రోడ్డు క్రాస్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న వినోద్ కుటుంబ సభ్యులకు ఎవరికీ గాయాలు కాలేదు. వినోద్ ఫిర్యాదు మేరకు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం మార్చురీకి తరలింపు

శ్రీకాళహస్తి, మే 8: గుర్తు తెలియని దుండగులు చేత హతమైన లక్ష్మమ్మ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శ్రీకాళహస్తి మండలం ఈండ్రపల్లి గ్రామంలో లక్ష్మమ్మ అనే కల్లు విక్రయించే వృద్ధురాలు హత్యకు గురైన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం అధికారులు ఘటనా స్థలంలో పంచనామా పూర్తి చేశారు. అనంతరం శవాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే ఇన్‌క్వెస్ట్ సకాలంలో ఇవ్వలేదని... వైద్యులు సకాలంలో స్పందించలేదని పోలీసులు, వైద్యులు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుని బుధవారం జరగాల్సిన పోస్టుమార్టం వాయిదా వేశారు. పోస్టుమార్టం ఆలస్యం చేయడంపై బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, మే 8: పాలిసెట్ పరీక్షలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పట్టణంలోని విజన్ గురుదేవ అకాడమీలో పాలిసెట్ శిక్షణ పొందిన టీ.చరణ్ రాష్ట్రస్థాయిలో 528, సీహెచ్. గణేష్ 1099వ ర్యాంకు సాధించారు. అకాడమీ నిర్వాహకులు శివారెడ్డి విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి, మే 8: రోడ్డు ప్రమాదంలో యశ్వంత్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు... పట్టణానికి చెందిన యశ్వంత్ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. మంగళవారం రాత్రి డిగ్రీ కళాశాల సమీపంలో రహదారి దాటుతుండగా ఆటో ఢీకొంది. వెంటనే అదే ఆటోలో గాయపడిన యశ్వంతును శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.



గాయపడిన యశ్వంత్

వెలమల ఆదరణ మరువలేం: సుధీర్ రెడ్డి



రాంబాబు నాయుడు దంపతులను సన్మానిస్తున్న బొజ్జల కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి, మే 8: బొజ్జల కుటుంబానికి వెలమ సామాజికవర్గ ప్రజలు అందిస్తున్న ఆదరణను ఎప్పటికీ మరువలేమని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో బుధవారం వెలమల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషితా రెడ్డి, తల్లి బృందమ్మ హాజరయ్యారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి సుదీర్ఘకాలం అనుచరులుగా పనిచేసిన రాంబాబు నాయుడు దంపతులను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వెలమ సామాజిక వర్గ ప్రజలు తమను సొంత కుటుంబ సభ్యులుగా ఆదరిస్తున్నారని చెప్పారు. నాలుగు దశాబ్దాలుగా బొజ్జల కుటుంబంపై వారు చూపిన అభిమానాన్ని మాటల్లో చెప్పలేమన్నారు. వెలమలకు అన్నివేళలా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం బొజ్జల కుటుంబ సభ్యులను వెలమ సామాజికవర్గ పెద్దలు సన్మానించారు. కాగా, బొజ్జల సుధీర్ రెడ్డి గెలుపు కోసం పలువురు టీడీపీ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. తొట్టంబేడు మండలంలోని సింగమల పంచాయతీలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మునిరాజా నాయుడు, ఎస్సీవీ కిరణ్, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ఏర్పేడు, మే 8: ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో అత్తూరు కేశవరెడ్డి, సీతాపతి సమక్షంలో 50 కుటుంబాల వైసీపీ వారు బుధవారం టీడీపీలో చేరారు. వారికి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో హేమాద్రి, శేఖర్, ధనంజయులు, శ్రీనివాసులు, పునీత, ప్రకాష్ తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజునాయుడు, కేశవులు, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో రిషితారెడ్డి

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి: వరప్రసాద్







ప్రధాని మోదీకి అభివాదం చేస్తున్న తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు- సభికులకు అభివాదం - సభా ప్రాంగణంలో బీజేపీ నాయకులతో

తడ, మే 8: అన్నమయ్య జిల్లా కలికిరిలో జరిగిన బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి బహిరంగ సభలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు పాల్గొన్నారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మాజీ సీఎం, రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్న బహిరంగసభకు వరప్రసాద్ హాజరయ్యారు. తనను ప్రధానికి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ బహిరంగసభలో వారితోపాటు టీడీపీ నాయకుడు ఎల్.రమణ, జనసేన నాయకుడు నాగేంద్రబాబు, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి



జేడీ రాజశేఖర్‌తో మహేష్‌బాబు

వరదయ్యపాళెం, మే 8: వరదయ్యపాళెం మండలంలో స్వతంత్ర్య అభ్యర్థి జేడీ రాజశేఖర్ ఎన్నికల ప్రచారంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పాల్గొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖలో వాచర్‌గా పనిచేస్తున్న సి.మహేష్‌బాబు ఇటీవల వరదయ్యపాళెం మండలం మోపూరుపల్లి గ్రామంలో జరిగిన రాజశేఖర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు.

నేడు సిద్ధ ఔషధ నేత్ర వైద్య శిబిరం

వరదయ్యపాళెం, మే 8: వరదయ్యపాళెం మండలం బత్తలవల్లంలోని ఏకం ప్రాంగణంలో గురువారం లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్ధ ఔషధ నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల కవాతు

కేవీబీపురం, మే 8: కేవీబీపురం మండలంలోని పెరిందేశం, మిద్దెకండ్రిగ, రాజులకండ్రిగ గ్రామాల్లో బుధవారం సీఐ భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షేక్ షరీఫ్, ఏఎస్ఐ లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘాలకు రుణాల పంపిణీ

ఏర్పేడు, మే 8: మండలంలోని పాపానాయుడుపేటలో రాష్ట్రీయ సేవాసమితి మహిళా భారతి శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతు రుణమేళా నిర్వహించారు. మహిళాభారతి ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి 92మంది రైతులకు రూ.53లక్షలు రుణాలు అందించారు. కషాయాల తయారీ, వినియోగం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, డ్రోన్ల వినియోగం గురించి శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో రాముకుమార్, అన్నాదురై, వెంకట్‌కుమార్, మునీంద్ర, మునిపార్థసారథి, తిరుపాల్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడండి: సుధాకర్

శ్రీకాళహస్తి, మే 8: రాష్ట్రాన్ని అన్ని విధాలా దెబ్బతీసిన వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పల్లమాల సుధాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కార్యకర్తలతో కలిసి ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. శ్రీకాళహస్తి మండలం లోని బూడిద మిట్ట, చుక్కల నిడిగల్లు, అబ్బా బాట్లపల్లి, రామాపురం గ్రామాల్లో, పట్టణంలోని కొండమిట్ట ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరించారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అమలు చేయబోయే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాతగా నిలిచిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు సుధీర్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే తిరుపతి ఎంపీగా వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లమాల శశాంక్, బీజే ప్రసాద్, పూల ఆనంద్, పగడాల సుధాకర్, గుర్రప్ప శెట్టి తదితరులు పాల్గొన్నారు.



రామాపురంలో ప్రచారం చేస్తున్న పల్లమాల సుధాకర్

ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి: ఆదిమూలం

సత్యవేడు, మే 8: ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం సత్యవేడు మండలంలోని ఇరుగుళం, రాజగోపాలపురం, రంగనాథపురం, పీవీపురం, ఏఎంపురం, మదనంబేడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించి ప్రజలకు సంక్షేమం అందించాలంటే ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. కాగా ఏఎంపురంలో వైసీపీ సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆదిమూలం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గుర్రప్ప, రోశయ్య, పీఎస్ఆర్, పరమశివమ్, ప్రభాకర్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్, బాల మురళి, చికెన్ చిన్న, అరుల్ పాల్గొన్నారు.



రంగనాథపురంలో మాట్లాడుతున్న ఆదిమూలం

అవినీతి కావాలా... అభివృద్ధి కావాలా?: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మే 8: అవినీతి చేసే రోజా కావాలో... అభివృద్ధి చేసే భానుప్రకాష్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రజలకు సూచించారు. బుధవారం పుత్తూరు మున్సిపల్ పరిధిలోని గేటు పుత్తూరు 3,4,5,6,7,8 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే రోజా మండలానికి ఒక కౌంటర్ తెరిచి కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి వసూలుకు పాల్పడిందని ఆరోపణలు సంధించారు. తన అవినీతి దాహానికి కలియుగ వేంకటేశ్వరస్వామిని కూడా వదలలేదని ధ్వజమెత్తారు. ఇలాంటి ఎమ్మెల్యే అవసరమా అని ప్రశ్నించారు. పుత్తూరు అభివృద్ధి ముద్దుకృష్ణమ హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో సేవలు అందించిన నాయకుడు ముద్దుకృష్ణమని వివరించారు. పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చే బాధ్యత చంద్రబాబు, తనదని స్పష్టం చేశారు. అలాగే 50 ఏళ్లు దాటిన బీసీలకు నెలకు రూ.4 వేలు పింఛను, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామని వాగ్దానం చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌కు అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పట్టారు. ఎన్నడూ లేని విధంగా పవర్‌లూమ్స్‌ను నిలిపివేసి ఆయన కోసం గేటు పుత్తూరు వాసులు వేచిచూడడం విశేషం. కార్యక్రమంలో డీఎస్ ఏలుమలై, డీఎస్ గణేష్, ఎంఎస్ కరుణాకరణ్, ఎన్ఎన్ ధనపాల్, అన్బు, యుగంధర్, డీజీ ధనపాల్, అశోక్, జి.బాబు, కౌన్సిలర్ కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.



గేటు పుత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న భానుప్రకాష్

టీడీపీ గెలుపుతోనే నగరి అభివృద్ధి

వడమాలపేట, మే 8: టీడీపీ గెలుపుతోనే నగరి నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బురాజు చెప్పారు మండలంలోని బట్టీకండ్రిగ పంచాయతీలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ అభ్యర్థి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ధనంజయులు నాయుడు, అజిత్‌కుమార్, శ్రీధర్‌రాజు, పొన్నయిరాజు, రఘువర్మ, వెంకటేష్, నితీష్ వర్మ, గోపి, కేవీ.రామచంద్రరాజు, రమణరాజు, భార్గవరాజు తదితరులు పాల్గొన్నారు.



బట్టీకండ్రిగలో టీడీపీ నేతల ప్రచారం